



హ్యాపీ బర్త్‌డే సార్!

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు.. ఆయన అభిమానులు కేకులు కట్ చేసి పండుగ చేసుకున్నారు.. మంత్రి కందుల దుర్గేష్ అమరావతిలో మంగళవారం పవన్ కల్యాణ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు..





రాజమండ్రిలో వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టనున్నారు.. ప్లాస్టిక్ బాటిల్ ఆకారంలో ఇలా తయారుచేయించి జంక్షన్లలో ఏర్పాటు చేయనున్నారు.. వాడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు అందులో వేసేలా అవగాహన కల్పించనున్నారు.

ఇలా.. చేస్తే ఎలా!

గోదావరి రివర్ ఫ్రంట్ పనులను మంగళవారం ఎంపీ పురందేశ్వరి పరిశీలించారు.. నత్తనడకన సాగుతుండడంపై అధికారులను ప్రశ్నించారు.. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.. ఆమె వెంట ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఉన్నారు..



శాంతించినది!

6

గోదావరి తగ్గుముఖం పట్టింది.. ధవళేశ్వరం వద్ద మంగళవారం మొదటి ప్రమాద హెచ్చరికను ఎత్తివేశారు.. దీంతో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజానీకం ఊపిరిపీల్చుకున్నారు.. లంకలు మెల్లమెల్లగా తేరుకుంటున్నాయి..



భూ..తాలు!

ఫ్యాన్ కేటాయింపు.. అక్రమాల కంపు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రభుత్వశాఖలకు ఉచితంగా కేటాయించిన భూములు చాలా వరకు పరాధీనమయ్యాయి. కేటాయించిన అవసరాలకు బదులు పలువురు నేతల కబ్జాల్లోకి వెళ్లిపోయాయి. పేరుకు బయటకు ప్రభుత్వ శాఖల అవసరాలకు ఉచితంగా కేటాయిస్తే వాటిని అనేకచోట్ల చెరబట్టి దారి మళ్లించేశారు.గత వైసీపీ సర్కారు హయాంలో అలియ నేషన్ పేరిట విలువైన ప్రభుత్వ భూములు వివిధ శాఖల అవసరాలకు ఉచితంగా కేటాయించగా,వాటిలో చాలా వరకు ఆపార్టీ నేతలే వాలిపోయి ఎంచక్కా అనుభవిస్తున్నారు. లీజులకు ఇచ్చేసి అడ్డగోలుగా జేబులు నింపేసుకుంటున్నారు. సబ్‌స్టేషన్లు, స్కూళ్లు, సచివాలయాలు, ఆర్బీకేలు, బల్క్‌మిల్క్ సెంటర్లకు ఇచ్చిన స్థలాల్లోను పాగా వేసేశారు. ఈ తరహా కబ్జాలపై ప్రభుత్వం తాజాగా దృష్టిసారించింది. ఇంతవరకు ఎన్ని భూములు ఇలా కేటాయించరనేదానిపై నివేదికలు రప్పిస్తోంది. గడచిన ఐదేళ్లలో 5,700 ఎకరాల వరకు కేటాయించినట్టు ప్రభుత్వానికి నివేదికలు సిద్ధం చేశారు.

విలువైన భూములు ఉచితంగానే..

రెవెన్యూశాఖ ఆధీనంలో ఉమ్మడి జిల్లాలో కోట్ల విలువైన వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. వీటిని ప్రభుత్వాలు రకరకాల అవసరాల పేరుతో వినియోగించుకుంటున్నాయి. ఇతర ప్రభుత్వ శాఖలకు కావాలంటే రెవెన్యూ శాఖ నుంచి ఉచితంగా అలియనేషన్ కింద ప్రభుత్వం కేటాయిస్తూ వస్తోంది. కొన్ని కంపెనీలకు కావాలంటే ధర నిర్ణయించి వసూలు చేసి వాటికి కేటాయిస్తున్నాయి. ఇలా అలియనేషన్ కింద వివిధ ప్రభుత్వశాఖలకు ఉచితంగా కేటాయిస్తోన్న భూములు కాలక్రమేణా కబ్జాలకు గురవుతున్నాయి. కొందరు పలుకుబడి కలిగిన నేతలైతే ప్రభుత్వ శాఖల పేరుతో భూములు ఉచితంగా కొట్టేసి ఆనక వాటిలో పాగా వేసేస్తున్నారు. వీటిని వ్యాపార అవసరాలకు కేటాయించడం, సొంత వ్యాపారాలకు గోదాములు నిర్మించడం వరకు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి.



అప్పట్లో జగన్ సర్కారు కొత్తగా తెచ్చిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్, చిల్లింగ్ కేంద్రాలకు ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అలియనేషన్ విధానంలో ఉచితంగా పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీశాఖ, పశుసంవర్ధకశాఖలకు కేటాయించేశారు. కాలువల వెంబడి భూములను ఎడాపెడా ఇచ్చిపారేశారు.వీటిని కేటాయించిన అవసరాలకు కాకుండా ఆ ముసుగులో కొందరు వైసీపీ నేతలు మూడు జిల్లాల్లో పలు చోట్ల వాటిలో పాగా వేసేసి సొంత అవసరాలకు వాడుకుంటు న్నారు.దీంతో ప్రస్తుత ప్రభుత్వం వీటిపై కన్నేసింది. గత ఐదేళ్లలో ఏయే శాఖలకు వీటిని ఎంతెంత విస్తీర్ణంలో కేటాయించారు? వాటిలో అసలు ఎవరుంటున్నారు? ఆయా శాఖల అవ సరాలకు నిజంగానే వీటిని వాడుతున్నారా? లేదా? అనేదానిపై పూర్తిస్థాయిలో నివేదికలు పంపాలని కోరింది. మండలాల వారీగా ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలు ఏయేశాఖలకు కేటాయించారో లోతుగా వివరాలు పంపాలని ఆదేశించింది. జిల్లాల వారీగా రెవెన్యూశాఖ ఈ వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేసింది.

5700 ఎకరాల మాటేమిటి..

కాకినాడ జిల్లాలో రెవెన్యూ శాఖకు చెందిన వేల కోట్ల విలువైన 4,601 ఎకరాల భూములను వివిధ శాఖల అవసరాలకు ఇప్పటి వరకు ఉచితంగా కేటాయించినట్టు నివేదికలో తేల్చారు. ఉమ్మడి జిల్లాలో ఇదే అత్యధికం. ఇందులో కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో 1,903 ఎకరాలు, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 2,697 ఎకరాలను ఉచితంగా కేటాయించారు. ఒక్క కాకినాడ రూరల్ మండలంలోనే వేల కోట్ల విలువైన 1,483 ఎకరాలు భూములను వివిధ ప్రభుత్వ శాఖల అవసరాల ముసుగులో ఉచితంగా కేటాయించేశారు. వీటిలో ఎక్కువగా గత వైసీపీ హయాంలో కేటాయించినవే ఉన్నాయి. ప్రభుత్వశాఖలకు కేటాయించిన ఈ భూములను కొందరు వైసీపీ నేతలు తమ పలుకుబడితో కబ్జా చేసేసి సొంతంగా వాడుకుంటున్నారు. కొందరైతే ఏకంగా ప్రైవేటుగా గోదాములు నిర్మించి అద్దెలకు ఇచ్చేసుకున్నారు. మరికొందరు లీజులకు ఇచ్చేశారు. కానీ భూమి పొందిన ప్రభుత్వ శాఖలు మాత్రం కిమ్మనడం లేదు. తొండంగి మండలంలో 2,405ఎకరాల్లో సగానికి పైగా కాకినాడ సెజ్‌కు కేటాయించారు. మరికొంత పోలవరం కాలువ, సబ్‌స్టేషన్లకు కేటాయించారు. వీటిలోను అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కోనసీమ జిల్లాలో గడచిన ఐదేళ్లలో 479 ఎకరాల వరకు కేటాయించారు. ఇందులో జల వనరులు, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, పంచాయతీశాఖలకే అధికంగా ఉన్నాయి. వీటిలోను అనేక చోట్ల ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. పలుచోట్ల చెరువులు, కోళ్లఫారాలు, షెడ్లు నిర్మించేసి వాడేసుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, అనపర్తి నియోజకవర్గాల్లో కేటాయింపులు జరగ్గా, వీటిలోను అనేకచోట్ల ఆయా శాఖలకు కేటాయించిన భూములపై నిఘాలేక ఇతరత్రా అవసరాలకు మళ్లిపోయినట్టు గుర్తించారు. తాజాగా ఉన్నతాధికారులు ఈ మేరకు భూకేటాయింపుల వివరాలతో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారు.

- ప్రభుత్వ భూమి.. ప్రైవేటు లొసుగు
- భూకేటాయింపుల్లో అక్రమాలెన్నో
- గత ప్రభుత్వంలో విచ్చలవిడితనం
- 5,700 ఎకరాలు పరాదీనం
- భూముల్లో వైసీపీ నేతల పాగా
- దృష్టిపెట్టిన కూటమి ప్రభుత్వం
- జిల్లాల వారీగా నివేదికలు సిద్ధం
- అనేక చోట్ల అడ్డగోలు వ్యాపారాలు
- కాకినాడ జిల్లాలో 4,601
- కోనసీమ, తూర్పున 1,100

నెలంతా.. రేషన్!



కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు శుభవార్త. ఇక నుంచి ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు నెలంతా తెరిచే విధంగా పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేయనుంది. ఇప్పటికే దీనిపై ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ క్లారిటీ ఇచ్చేశారు. ఇకపై నెలంతా రేషన్ ఇచ్చే విధంగా ఆదేశాలు ఇస్తున్నామని మంత్రి ప్రకటించారు. దీంతో లబ్ధిదారుల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 17 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరూ ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ డిపోల నుంచి సరుకులు తీసుకుంటున్నారు. అయితే వివిధ పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన కూలీలు, సామాన్యులు ఒక్కొక్క పర్యాయం అనుకున్న సమయానికి రేషన్ తీసుకోలేకపోతున్నారు. అలా తీసుకోని నెలలో బియ్యం, పంచదార వంటి నిత్యావసర వస్తువులు వదిలుకోవాల్సి వస్తోంది. తాజాగా పౌరసరఫరాలశాఖ మంత్రి ఇచ్చిన ప్రకటన నేపథ్యంలో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ ఇవ్వడం వల్ల కేవలం 90 శాతం కార్డుదారులకు మాత్రమే రేషన్ సరఫరా అవుతుంది. ప్రధానంగా నగరాల్లో, పట్టణాల్లో అయితే పోర్టబులిటీ విధానం వల్ల ప్రతి నెల పదో తేదీ వచ్చే సరికే పలు దుకాణాల్లో బియ్యం నిండు కుంటు న్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన కార్మికుల కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రధానంగా కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర పట్టణాల్లో ప్రతి నెల పదో తేదీకే 50 శాతం రేషన్ దుకాణాల్లో బియ్యం నిండుకుం టున్నాయి. దీనివల్ల బియ్యాన్ని పేదలు పొందలేక పోతున్నారు. ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కాలంటే నెలంతా రేషన్ పంపిణీ ద్వారా సాధ్యపడుతుంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు రేషన్ పంపిణీ చేయడం వల్ల ఏదైనా వీలున్న సమయంలో సరకులు తెచ్చుకునే సౌలభ్యం లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో ఉన్న రెండువేల రేషన్ దుకాణాలు ఇక నుంచి నెలంతా ఓపెన్ చేసే ఉంటాయి. పేదలకు సరుకులు పంపిణీ చేస్తూనే ఉంటాయి.

- 15రోజుల కాలపరిమితి ఎత్తివేత
- 365 రోజులు రేషన్ దుకాణాలు
- 17 లక్షల కార్డుదారులు
- ఉమ్మడి జిల్లాలో అమలు

త్వరలో మరిన్ని సరుకులు

ఇక నుంచి రెగ్యులర్‌గా ప్రతినెల కందిపప్పు, నూనె, రాగులు, గోధుమపిండి రేషన్ కార్డుదారులకు ఇస్తామని మంత్రి ప్రకటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి వినియోగం ఎక్కువ. దీంతో కార్డుదారులు స్వాగతిస్తున్నారు.

ఉత్తర్వులకు ఎదురుచూపులు..

దీనిపై ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని కాకినాడ జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు తెలిపారు. ఉత్తర్వులు వచ్చిన తర్వాత దానిలో పేర్కొన్న విధంగా జిల్లాలో రేషన్ దుకాణాలు తెరిచి ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు రేషన్ దుకాణాల ద్వారా సమర్థంగా, నిత్యావసరాలు సకాలంలో అందజేస్తామన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా సౌభాగ్యలక్ష్మి బాధ్యతలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ (ఎఫ్ఏసీ)గా మంగళవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసి విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ డైరెక్టర్‌గా బదిలీ అయిన డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ మంగళవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో డాక్టర్ సౌభాగ్యలక్ష్మి సూపరింటెండెంట్‌గా ఛార్జి తీసుకున్నారు. బుధవారం ఉదయం పదిన్నర గంటలకు ఆసుపత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేయడం జరుగుతుందని కొత్త సూపరింటెండెంట్ అన్ని విభాగాధిపతులకు ఉత్తర్వులు జారీ చేశారు.

పొగాకు పంటపై జీఎస్టీ తగ్గింపునకు వినతి

దేవరపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పొగాకుపంటపై జీఎస్టీ తగ్గించాలని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరిని పొగాకు రైతు సంఘం నాయకులు మంగళవారం కోరారు. రాజమహేంద్రవరంలోని ఎంపీ కార్యాలయంలో దేవరపల్లి, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, పొగాకు రైతులు ఎంపీని కలిశారు. పొగాకు పంటకు ప్రస్తుతం 28 శాతం జీఎస్టీ ఉందని రాబోయే రెండు, మూడు రోజుల్లో కేంద్ర ప్రభుత్వం కొన్న వస్తువులకు జీఎస్టీ తగ్గించే అవకాశం ఉందని దీనిలో భాగంగా పొగాకు పంటకు జీఎస్టీ తగ్గించాలని ఎంపీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై స్పందించిన ఆమె పొగాకు రైతు సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. కార్యక్రమంలో పొగాకు రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, కాట్రు సత్యనారాయణ, సింహాద్రి దర్మావతారం, కాట్రగడ్డ అశోక్, ఇల్లూరి రాంబాబు, పిన్నమనేని మధుమోహన్, కాకర్ల నంది, కాకర్ల జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ చేరువగా ఐపీపీబీ

పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) సేవలు ప్రతి ఇంటికీ చేరువవుతున్నాయని రాజమండ్రి పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కోట శేషారావు అన్నారు. ఐపీపీబీ 8వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంకింగ్ సేవలు చివరి ఇంటి వరకూ వెళ్లాలనే ఉన్నత లక్ష్యంతో ప్రధాని మోదీ ఐపీపీబీని 650 శాఖలతో 2018 సెప్టెంబరు 1న ప్రారంభించారని గుర్తు చేశారు. తపాలా శాఖకు అనుబంధంగా ఈ సంస్థ పని చేస్తుందన్నారు. ఐపీపీబీ రాజమండ్రి తపాలా డివిజన్ 3.5 లక్షల ఖాతాదారుల మైలురాయిని దాటిందన్నారు. రాజమండ్రిలోనే 50 వేల మంది ఖాతాదారులు ఉన్నారన్నారు. 51 శాతం కంటే ఎక్కువ మంది మహిళా ఖాతాదారులు ఉండడం హర్షించ దగిన విషయమన్నారు. డివిజన్‌లో 375 పోస్టాఫీసుల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. జనరల్, లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థల భాగ స్వామ్యంతో గ్రూప్ యాక్సిడెంటల్ గార్డ్, టర్మ్ పాలసీల వంటి సేవలను అందిస్తోందన్నారు.పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలు, సుకన్య సమృద్ధి యోజన, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, రికరింగ్ డిపాజిట్, తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా వంటి వివిధ పథకాల ఖాతాదారులు ఐపీపీబీ మొబైల్ యాప్ ద్వారా సాంకేతిక సమస్యలు లేకుండా చెల్లింపులు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఎం.రాజేంద్ర నాయుడు, పోస్టల్ ఇన్‌స్పెక్టరు వంశీకృష్ణ, ఐపీపీబీ మేనేజర్ సాగర్ బాబు, అసిస్టెంట్ మేనేజర్ రేవంత్,భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఖైదీల ఆహారం ఓకేనా?



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలకు ఏ న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పూర్తిగా సహకరిస్తుందని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక కారాగారాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం నాణ్యతా ప్రమాణాలు, సదుపా యాలపై సమీక్షించారు. ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. ఖైదీల కుటుంబీకులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.



కేడర్ వెల్ఫేర్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల, తదితరులు

కార్యకర్తల ఆరోగ్యానికి ప్రత్యేక ప్రణాళిక

టీడీపీ కేడర్ వెల్ఫేర్ కార్యక్రమం ప్రారంభించిన గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నా 44 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్యకర్తలే తన బలమని.. కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు చేదోడువాదోడుగా ఉండడమే తన జీవిత లక్ష్యమని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. టీడీపీ రాష్ట్ర హెల్త్ విభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్ ఆధ్వర్యంలో కార్యకర్తల ఆరోగ్యానికి సంబంధించి ప్రత్యేక ప్రణాళి కతో రూపొందించిన తెలుగుదేశం పార్టీ కేడర్ వెల్ఫేర్ అనే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ సెల్ సహకారంతో నిర్ధేశించిన కొన్ని ఆసుపత్రులకు కార్యకర్తలు వెళ్లినపుడు ఫీజులో 20 శాతం రాయితీ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించామన్నారు. సభ్యత్వ కార్డు కలిగిన వారు గోరంట్ల కార్యాలయానికి వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కేడర్ వెల్ఫేర్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో త్వరలో అమలు జేస్తారన్నారు. కేడర్ వెల్ఫేర్‌కు మొదటగా రూ.50 వేలు చెక్కును డాక్టర్ సెల్ టీమ్‌కు గోరంట్ల అందజేశారు.వివరాలకు 73860 50745 నెంబరులో సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్నివాసు దేవరావు, వెలుగుబంటి ప్రసాద్, పందూరి అప్పారావు పాల్గొన్నారు.

అవసరం మేరకు యూరియా : కలెక్టర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అవసరం మేరకు యూరియా సరఫరా చేస్తున్నామని, రైతులు అవగాహనతో శాస్త్రవేత్తల సూచనల మేరకే ఎరువులు వినియోగించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు సమయానికి సరఫరా అవుతున్న ఎరువులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ జిల్లాకు 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకూ 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చినట్టు చెప్పారు. గత ఖరీఫ్‌లో 13,300 మెట్రిక్ టన్నులు వినియోగించగా, ఈ సీజన్‌లో ఇప్పటికే 19 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని, ఇంకా 2,300 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. రాజమహేంద్రవరం, గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో గతేడాది కంటే 99 శాతం యూరియా వినియోగం జరిగిందన్నారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే యూరియా వినియోగించాలని సూచించారు. రైతులు సరైన మోతాదులో వాడితేనే ఉత్పాదక స్థాయి పెరిగి పంటలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పని సరిగా బిల్లు తీసుకోవాలని చెప్పారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మినా,ఇతర ప్రాంతాలకు తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ యూరియా అవసరానికి మించి వాడడం వల్ల సాగు చేసే భూమిలో పోషక సమతుల్యత దెబ్బతింటుందన్నారు.ఎరువులు ఎక్కువ కాలం నిల్వ ఉంచితే గడ్డకట్టే ప్రమాదం ఉం దన్నారు. యూరియా వినియోగం మించకూడదని తెలిపారు.

ఉపాధి హామీ కింద 900 కేటిల్ షెడ్స్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం కింద పశువుల షెడ్ల నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. జిల్లాలోని 18 మండలాల్లో మండలానికి 50 వంతున షెడ్లు నిర్మించుకోవడానికి అధికారులు ప్రతిపాదనలు కోరుతున్నారు. ఈ మేరకు మొత్తం జిల్లాలో 900 షెడ్లు నిర్మించుకోవచ్చు. ఈ పథకం కింద గేదెలు, ఆవులు మాత్రమే కాక గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్‌లు నిర్మించుకోవచ్చు. జిల్లా పశువైద్యాధికారుల ద్వారా ఈ ఎంపిక జరుగుతుంది. గ్రామాల్లో షెడ్లు నిర్మించుకునేవారు ఆయా ప్రాంతాల్లోని వెటర్నరీ డాక్టర్లను సంప్రదిస్తే వారు పరిశీలించి జిల్లా అధికారికి ప్రతిపాదన పంపుతారు. వాటిని డ్వామా పీడీ కార్యాలయ అధికారులు పరిశీలించి అనుమతులిస్తారు. గేదెలు, ఆవులు వంటి వాటిని మూడు విభాగాలుగా విభజించారు. రెండు పశువులకు సరిపడా షెడ్ నిర్మించుకోవడానికి యూనిట్ ఖర్చు రూ.1 లక్షా 15వేలు. అందులో ఉపాధి హామీ పథకం కింద లక్షా 3 వేల 500 అంటే 90 శాతం ఇస్తారు. మిగతా 10 శాతం అంటే 11,500 లబ్ధిదారుడు భరించాలి. నాలుగు పశువుల షెడ్ నిర్మాణానికి రూ.1,85,000 అంచనా వేశారు. అందులో ఉపాధి హామీ కింద 90 శాతం అంటే రూ.1.66, 500, లబ్ధిదారుడి వాటా కింద 10 శాతం అంటే 18,500 భరించాలి. ఆరు పశువుల షెడ్ నిర్మాణానికి రూ.2,30,000 అంచనా వేశారు. అందులో ఉపాధి హామీ కింద ప్రభుత్వం 90 శాతం అంటే రూ.2,07,000 ఇస్తుంది. లబ్ధిదారుడి వాటా 10 శాతం అంటే రూ.23 వేలు భరించాలి. ఇక గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు అంచనాలు సిద్ధం చేశారు. 20 గొర్రెలు లేదా 20 మేకల కోసం నిర్మించే షెడ్‌కు రూ. 1,30,000 అంచనా వేశారు.అందులో ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం 91 వేలు అంటే 70 శాతం ఇస్తుంది. లబ్ధిదారుడు 30 శాతం వాటా అంటే రూ.39 వేలు భరించాలి. 50 గొర్రెలు లేదా,50 మేకల షెడ్ నిర్మాణానికి రూ.2,30,000 అంచనా వేశారు.అందులో 70 శాతం అంటే రూ.1,61,000 ఉపాధి హామీ కింద ప్రభుత్వం ఇస్తుంది. మిగతా 30 శాతం రూ.69 వేలు లబ్ధిదారుడు భరించాలి. 100 కోళ్ల కోసం నిర్మించే షెడ్‌కు రూ.87 వేలు అంచనా వేశారు.అందులో 70 శాతం అంటే రూ.60, 900 ఉపాధి హామీ కింద ప్రభుత్వం భరిస్తుంది. మిగతా 30 శాతం అంటే 26,100 లబ్ధిదారుడు భరించాలి. 200 కోళ్లకు నిర్మించే షెడ్ వ్యయ అంచనా రూ.1,32,000 అందులో 70శాతం అంటే రూ.92,400 ప్రభుత్వం ఇస్తుంది. మిగతా 30 శాతం రూ.39,600 లబ్ధిదారుడు భరించాలి.



ఆకాశ.. వీధిలో

ఆకాశవీధి అదిరిపోయింది.. ఎంతలా అంటే.. వెళ్లే అవకాశం ఉంటే ఒకసారి చూసొద్దామా అనేటంత.. మీరూ చూడండి ఎంత అందంగా ఉందో కదా.. చూసిన వారంతా వహ్‌వా అన్నవారే.. మంగళవారం రోడ్ కం రైలు బ్రిడ్జి పైనుంచి ఆకాశం అద్భుతంగా కనిపించి ఇలా కెమెరాలో బందీ అయ్యిందీ.. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఆ ఒక్కటీ అడక్కు..నా తొలి సినిమా

నటుడు పృథ్వీరాజ్



చాగల్లు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆ ఒక్కటీ అడక్కు సినిమాతో నటుడుగా జీవితం ప్రారంభించా...థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ ఇక్కడ అనే డైలాగ్ చాల పాపులర్ అయ్యి తనకు బాబా గుర్తింపు తెచ్చి పెట్టిందని సినీ నటుడు పృథ్వీరాజ్ అన్నారు. చాగల్లులో తెలగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ గణపతి నవరాత్రి ఉత్స వాల్లో సోమవారం రాత్రి గంద్రోతు కృష్ణారావు ఆడి టోరియంలో పృథ్వీరాజ్ దంపతులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయక్ దర్శకత్వంలో త్వరలో హీరో వెంకటేష్‌తో సినిమా ప్రారంభం అవుతున్నట్టు చెప్పారు.ఉత్సవాలను నిర్వహిస్తూ కళలు, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రం బాగుపడాలనే సంకల్పం ప్రజలకు మేలు జరగాలనే లక్ష్యంతో జనసేనాని పవన్ కల్యాణ్ కూటమిలో భాగస్వాములయ్యారన్నారు. ప్రజలకు 25 కేజీల బియ్యం కాదు కావా ల్సింది.. 25 సంవత్సరాల రాష్ట్ర అభివృద్ధి కావాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు.

ఇంట్లో దూరిన తాచు పాము



యానాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో బుష్ బుష్ అంటూ శబ్దాలు వినిపిస్తున్నాయి..ఏమిటీ వింత శబ్దాలు అనుకుంటున్నారు.. తీరా చూస్తే తాచుపాము.. అంతే ఒక్కసారిగాబెదిరిపోయారు.. పాము పాము అంటూ కేకలు వేశారు.. అది విన్న పాము ఒక్కసారిగా పడగ విప్పింది.. యానాం మినీ సివిల్ స్టేషన్ వెనుక ఉన్న రథం షంత రోడ్డులో నాగుపాము హల్‌చల్ చేసింది.. బాలికల హాస్టల్‌ను అనుకుని ఉన్న వీటీసీ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ మూతపడింది. దీంతో భవనంలోపల బయట పెద్దపెద్ద పొదలు ఏర్పడి పాములు తిరుగుతున్నాయి. మంగళవారం ఉదయం వాటిలో నుంచి నేరుగా పాము ఇంటిలోకి దూరినట్టు స్థానికులు చెబుతున్నాయి. ఉదయం కాబట్టి సరిపోయింది అదే రాత్రి సమాయంలో అయితే ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసాలు మధ్య ఉండే భవనం శుభ్రం చేయించాలని స్థానికులు కోరారు.



ఎలుకలను.. పట్టేద్దాం!

ఎలుకల నివారణ ఇలా చేయవచ్చు

వేసవి లేదా దమ్ము సమయంలో గట్లను చెక్కి వాటి పరిణామాన్ని తగ్గించడం, కలుపు మొక్కలు తీసివేయడం, బాటలు తీయడం ద్వారా ఎలుకల ఉధృతిని కొంత మేర తగ్గించవచ్చు. ఎలుకబోనులు, బుట్టలు వినియోగించి పంట తొలిదశలోనే నియంత్రించాలి. ఎలుకలు ఉండే బొరియల్లో ఊదర యంత్రాన్ని వినియోగించి పొగ పెట్టి చంపాలి. గుడ్ల గూబలను సంరక్షించడం ద్వారా ఎలుకలను నివారించవచ్చు. ఎలుకల నిర్మూలనకు రసాయనిక పద్ధతి మంచి ఫలితాలను ఇస్తుంది. బ్రోమోడయోలిన్ మందును వరి నూకల ఎరలో 0.005 శాతం మోతాదులో కలిపి వాడాల్సి ఉంటుంది. దీనిని తిన్న ఎలుకలు 5-6 రోజుల్లో చనిపోతాయి. ఎలుకల నివారణకు వినియోగించే బ్రోమోడయోలిన్ మందును వ్యవసాయశాఖ ఉచితంగా సరఫరా చేస్తోంది. హెక్టారుకు కనిష్ఠంగా 10 గ్రాముల మందును వాడాల్సి ఉంటుంది. 100 గ్రాముల విషపు ఎర తయారీకి 2గ్రాముల బ్రోమోడయోలిన్ మందు,96 గ్రాముల నూకలు, 2గ్రాముల నూనె కలిపి సజీవ బొరియకు 10 గ్రాముల ఎరను పొట్లాలుగా పెట్టాలి.



బ్రోమోడయోలిన్ మందు కలిపే విధానంపై అవగాహన

- ఎలుకలను విస్మరిస్తే అపార నష్టం
- వరి దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం
- నేటి నుంచి సామూహిక ఎలుకల నివారణ
- బ్రోమోడయోలిన్ మందు ఉచితంగా పంపిణీ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమలు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ఎలుకలే కదా అని విస్మరిస్తే అవి కలిగించే నష్టం అపారం. దిగుబడులు గణనీయంగా తగ్గి 50 శాతం వరకూ నష్టాన్ని కలుగజేస్తాయి. వీటి సామూహికంగా నిర్మూలిస్తేనే రైతులు కష్టాల నుంచి బయటపడతారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల కంటే ముందు రైతులకు ఎలుకల రూపంలో బెడద ఎదురవుతోంది. విత్తనం వేసిన దగ్గర నుంచి నాట్లు, పొట్ట, ఈనే, వరి కంకులు, గింజ గట్టిపడే దశల్లో, కోతలు, ఇత ర సమయాల్లో, వరి కుప్పలు పొలాల్లో ఉంచినా ఇవి నష్టాన్ని కలగజేస్తాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నష్టశాతం అధి కంగా ఉండడం రైతులను కలవరానికి గురిచేస్తోంది.

ఎలుక జీవితకాలం 18 నెలలు

ఎలుకల జీవితకాలం 12 నుంచి 18 నెలలు. తన జీవితకాలంలో ఒక ఎలుక పది కిలోల వరకూ ఆహార ధాన్యాలను తిని మరో 100 కిలో లు పాడు చేస్తోంది. ఎలుకలతో పాటు పందికొక్కులు, ఇళ్లల్లో తిరిగే ఎలుక జాతులు వరి పంటకు 10 నుంచి 50 శాతం వరకూ నష్టాన్ని కలుగజేస్తాయి. ఎలుకలు ఉలి వంటి ముందు పళ్లతో పంటకు నష్టం చేకూరుస్తాయి. ఈ పళ్లు రోజుకి 0.4 మి.మీల వంతున పెరిగి కపాలాన్ని చీల్చుకుపోయి ఎలుక మరణించే అవకాశం ఉంది. దీని నుంచి తమను తాము కాపాడుకునేందుకు ఎదురైన ప్రతి వస్తువును ఎలుకలు కొరుకుతాయి. పొలాల్లో వరి పంటను ఇదే రీతిలో కొరుకుతూ ఉంటాయి. వరి దుబ్బులను ఏటవాలుగా 45 డిగ్రీల కోణంలో నీటిమట్టం పైభాగంలో కత్తిరించి నష్టాన్ని కలగచేస్తాయి. కాండాన్ని, మొవ్వలను తింటాయి. కుదురు ఏర్పడిన నాటి నుంచి కోత సమయం వరకూ ఎలుకలు విజృంభిస్తాయి. పాలు పోసుకుంటున్న, గట్టి పడుతున్న కంకులను కొరికి వాటిని బొరియల్లో దాచుకుంటాయి. రాత్రి పూట తిరిగే ఎలుకలు పగటి పూట మా త్రం అంతగా సంచరించవు. పొలాల్లో వరి ఇతర పంటలు ఉంటే ఎలుకలు అక్కడే ఎక్కువగా సంచరిస్తాయి. పంట లేకుంటే ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతాయి.

ఎలుకల నియంత్రణపై రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమం



వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నియంత్రణపై బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రైతులకు ఎలుకల బొరియల గుర్తింపు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తాం. రైతులు వరినూకలు,నూనె తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వస్తే బ్రోమోడయోలోన్ మందు అందజేస్తాం. - **స్వాతి, వ్యవసాయ సహాయ సంచాలకురాలు, పిఠాపురం**



వాళ్లు చదువుకున్న వెలగతోడు హైస్కూల్‌లో సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కష్టపడి..టీచర్లయ్యారు!

డీఎస్సీ కొట్టిన రోడ్ రోలర్ డ్రైవర్.. తాపీమేస్త్రి



సన్యాసి రావు మణి కుమార్

మండపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): చదువుకున్నామన్న గర్వం వారిద్దరికీ లేదు. చదువుకుంటే ఇప్పుడు కాకపోతే ఎప్పుడైనా ఉద్యోగం వస్తుందన్న ఆశ మాత్రం ఉంది. అయినా సరే, ఖాళీగా ఉండకుండా కుటుంబ పోషణ కోసం ఒకరు రోడ్డురోలర్ డ్రైవర్ అయ్యారు. మరొకరు తాపీమేస్త్రీగా పనిచేస్తూ వచ్చారు. ఇంతలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. పగలు తమ పని చేసుకుంటూ రాత్రిళ్లు డీఎస్సీకి ప్రిపేర్ అయ్యారు. చివరకు విజయం సాధించి ఉపాధ్యాయులయ్యారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం వెలగతోడు గ్రామానికి చెందిన మాచర్ల మణికుమార్, ముల్లు సన్యాసిరావు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నారు. బీఈడీ కూడా పూర్తిచేశారు. తర్వాత ఉపాధి కోసం మణికుమార్ తాపీపని చేస్తుండగా, సన్యాసిరావు రోడ్డు రోలర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. డీఎస్సీ ప్రిపరేషన్ కోసం కోచింగ్‌కు వెళ్లే స్థోమత లేక వీరిద్దరూ పగలు పనులకు వెళుతూ రాత్రి సమయాల్లో ఇంటి వద్దే చదివేవారు. డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబరచి మణికుమార్ 99వ ర్యాంక్ సాధించగా.. సన్యాసిరావు 336వ ర్యాంక్ సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. చదువు తరగని ఆస్తిగా భావించిన ఈ ఇద్దరు కష్టపడి చదివి కోచింగ్ లేకుండా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన నేపథ్యంలో వెలగతోడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సొంటెటి శ్రీనివాసరావు మంగళవారం పాఠశాలలో వీరిని సత్కరించారు. తమ పాఠశాలలో చదువుకుని ఉపాధ్యాయ పోస్టులు సాధించిన వారిని సత్కరించడం తమ కెంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం వీరిద్దరూ మాట్లాడుతూ టీచర్లుగా మంచి పేరు తెచ్చుకుంటామన్నారు.టీచర్లు యేసురాజు,వీరవెంకట్రావు, సాయిబాబు, వీర భద్రరావు, సహదేవుడు, వీర్రాజు, స్వామినాథ్, తారకం, కృపామణి, ఆనంద్ అభినందించారు.

తగ్గుతున్న వరద ఉధృతి

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- కాటన్ బ్యారేజ్ నుంచి 9,47,435 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. రెండు రోజులుగా ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించిన నీటి మట్టం మంగళవారం మధ్యాహ్నం 3.45గంటలకు 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం 11.50 అడుగులకు చేరుకుంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 9,47,435 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది.ఎగువన అన్ని ప్రాంతాల్లో గోదావరి నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటి ప్రభావంతో భద్రాచలం వద్ద మంగళవారం మధ్యాహ్నం 12గంటల వరకు తగ్గిన నీటి మట్టం 41.30 అడుగులకు చేరుకుని సాయంత్రం 6గంటల వరకు అదే రీడింగ్ వద్ద కొనసాగింది.

ఎగువ నీటి మట్టాలు ఇవే


ఎగువ ప్రాంతాల్లో గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. మంగళవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద నీటి మట్టం 9.960 మీటర్లకు చేరుకోగా పేరూరు వద్ద 14.930 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.160 మీటర్లు, భద్రాచలం వద్ద 41.30 అడుగులు, కూనవరం వద్ద 18.080 మీటర్లు, కుంట వద్ద 10.220 మీటర్లు, పోలవరం వద్ద 11.950 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.100 మీటర్లుగా నీటి మట్టం నమోదయింది.

2068 టీఎంసీలు కడలి పాలు


కాటన్ బ్యారేజ్ నుంచి నేటి వరకు 2068.921 టీఎంసీల నీరు కడలిలో కలిసిపోయింది. గోదావరికి వరదల సీజన్ ప్రారంభమైన తరువాత ఆగస్టులో రెండు సార్లు ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యాయి. వరదలు లేని జూన్‌లో 24.914 టీఎంసీల నీరు కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహించగా జూలైలో 677.682 టీఎంసీలు, ఆగస్టులో 1219.405 టీఎంసీల నీరు సముద్రంలోకి కలిసింది.సెప్టెంబరులో రెండు రోజులకే 146.920 టీఎంసీలు సముద్రంలోకి ప్రవహించింది

తగ్గుతూ.. పెరుగుతూ..

చింతూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరద భయం లోతట్టు వాసుల్ని వదలడం లేదు. పదిహేను రోజులుగా తగ్గుతూ పెరుగుతూ కంటి మీదకునుకు లేకుండా చేస్తోంది.ఉదయం పూట తగ్గింది కదా అని కాసింత ఊపిరి పీల్చుకుంటే సాయంత్రం మళ్లీ పెరుగుతోంది. మంగళవారం ఉదయం భద్రాచలం వద్ద నీటి మట్టం 40.90 అడుగులుగా ఉండగా, రాత్రి 8గంటలకు స్వల్పంగా పెరిగి 41.90 అడుగులకు పెరిగింది. ఇక చింతూరు వద్ద శబరి నది ఉదయం 31 అడుగులుగా ఉండగా సాయంత్రం 8గంటలకు 32 అడుగులకు పెరిగింది. ఈ క్రమంలో మన రాష్ట్రం మీదుగా ఒడిస్సాకు వెళ్లే జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం వరకు సాగగా.. సాయంత్రం నిమ్మలగూడెం-కుయుగూరు వాగుపై ఉన్న వంతెన నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సోకిలేరు, చీకటివాగుల ఉధృతి పదిహేను రోజులుగా కొనసాగుతోంది. దీంతో రామన్నపాలెం, పెద్దసీతనపల్లి, ముకునూరు, ఏజీ కొడేరు పంచాయతీల పరిధిలోని గ్రామాలన్నీ దిగ్బంధంలోనే ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నాటు పడవలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల చికిత్స కోసమని ఆసుపత్రులకు తరలించిన ముగ్గురు మహిళలు మృతి చెందడంతో వారి మృతదేహాలను సైతం పడవలపైనే తరలించారు. ఎగువ రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలలో వర్షాలు కొనసాగుతున్నాయి.



మంగళవారం ఉదయం ఒడిస్సా హైవేపై వాహన రాకపోకలు



మంగళవారం సాయంత్రానికి ఒడిస్సా హైవేపై పెరిగిన వరద

కాకినాడలో 190 వాహనం

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 108 వాహనాలు కాలం చెల్లి మరమ్మతులకు గురవుతున్న నేపథ్యంలో వాటి స్థానంలో నూతనంగా 190 వాహనాలను అత్యాధునిక సాంకేతికతతో ప్రభుత్వం దశల వారీగా ప్రారంభించదలచింది. అందులో భాగంగా నూతన 190 వాహనాన్ని కాకినాడ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ నూతన అంబులెన్స్‌లో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్, ప్రాణాపాయంలో ఉన్న క్షతగాత్రులకు వెంటిలేటర్ సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా అధికారి రాధా కృష్ణ, 108 డీఎం అభినాష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో ఫ్లెక్సీ వివాదం

దళిత సంఘాల ఆందోళన..తొలగింపు

మామిడికుదురు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి మార్కెట్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ వల్ల వివాదం తలెత్తింది. గ్రామ దళిత సంఘాలు ఫ్లెక్సీలో పేర్కొన్న వ్యాఖ్యలను ఖండిస్తూ ఆందోళన నిర్వహించారు. 'మీరెంత? మీ స్థాయి ఎంత ? రోడ్డు పడేస్తాం కొడకల్లారా! ఇది పవన్‌కల్యాణ్ సీమ, ఎప్పటికీ మాదే! అన్న వ్యాఖ్యలతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని దళిత సంఘాలు తీవ్రంగా విమర్శించారు. దళితుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఫ్లెక్సీలో ఈ వ్యాఖ్యలు చేశారని అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరును వక్రీకరించే విధంగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీని ఏర్పాటుచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితిని సమీక్షించి ఆందోళనకారులతో చర్చించారు. జనసేన నాయకులు ఆ ఫ్లెక్సీని తొలగించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పలువురు పాల్గొన్నారు.

సమృద్ధిగా యూరియా నిల్వలు

వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీ రావు పేర్కొన్నారు. అమరావతి నుంచి ఆయన మంగళవారం వివిధ జిల్లాల వ్యవసాయశాఖ జేడీలు, ఏడీఏలు, ఏవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ సీపోర్టుకు ఇండోనేషియా నుంచి వచ్చిన 40వేల మెట్రిక్ టన్నుల యూరియాలో ఏపీకి 17వేల మెట్రిక్ టన్నులను కేంద్రం కేటాయించిందన్నారు. అలాగే ఇతర పోర్టులకు వచ్చే యూరియా నుంచి కూడా పెద్దఎత్తున ఏపీకి కేటాయిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. కాకినాడ జిల్లాలో కావాల్సిన మేరకు యూరియా సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, విజిలెన్స్ బృందాలు ఎరువుల అక్రమ నిల్వలపై దాడులు చేయాలన్నారు. ఈనెల 30వ తేదీలోపు ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో నాకో బృందం పర్యటన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న నాకో బృందం

పెద్దాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) లో ఉన్న ఐసీటీసీ, సంపూర్ణ సురక్ష, లింక్ ఏఆర్టీ కేంద్రాలను నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో, న్యూఢిల్లీ) బృందం మంగళవారం సందర్శించింది.నాకో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎంటీ దాస్, కన్సల్టెంట్ రాహుల్ అహుజాతో కూడిన బృందం ఇక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. దీనిలో భాగంగా హెచ్ఐవీ బాధితులకు అందుతున్న సదుపాయాలు, పనితీరు, భాగస్వామ్య పరీక్షలపై ఆరాతీశారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీటీసీ, సంపూర్ణ సురక్ష కేంద్రం, లింక్ ఏఆర్టీ కేంద్రాలకు వచ్చే వారి వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జస్విందర్ సింగ్, డాక్టర్ వై.కామేశ్వరప్రసాద్, అదనపు డైరెక్టర్ డాక్టర్ చక్రవర్తి, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ప్రభాకర్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరి, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సుకుమార్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ బుజ్జిబాబు, నాజియా హసీన్, శశి, చంద్రమౌళి, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో వైభవంగా పవిత్రోత్సవాలు



స్వామి,అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న అర్చకులు

అంతర్వేది, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో సోమవారం రాత్రి ప్రారంభమైన స్వామివారి పవిత్రోత్సవాల్లో రెండో రోజు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమయ్యాయి. స్వామివారి పురాతన కల్యాణ మండపం వద్ద ఉత్సవ మూర్తులను ప్రత్యేక సింహాసనంపై ఆసీనులు చేసి పంచామృతాలతో, పంచ సూక్తాలు, వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు జరిపారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. బుధ, గురువారాల్లో పవిత్రోత్సవాలు మరింత వైభవంగా జరుగుతాయని ఏసీ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాల రాజాబహుదూర్, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



అన్నవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఒక దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. తొండంగి మండలం బెండపూడికి చెందిన మద్దుకూరి అన్నపూర్ణ లక్ష రూపాయలను దేవస్థానం చైర్మన్ రోహిత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం అందించారు.

దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకే వర్గీకరణ

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దేశంలో దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు జరిగిన అతిపెద్ద రాజకీయ కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా దళితుల ఐక్యతను దెబ్బతీస్తూ లబ్ధి పొందాలనే లక్ష్యంతో ఎస్సీ వర్గీకరణ చేపట్టారని ఆరోపించారు. కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రత్నాకర్ మాట్లాడుతూ వర్గీకరణతో వందలో నలుగురికి మాత్రమే లబ్ధి చేకూరుతుందన్నారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలుంటే ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే చట్టాలు చేశారన్నారు. వర్గీకరణను వెనక్కు తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రత్నాకర్ హెచ్చరించారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు, నెల్లి సూరిబాబు, గుర్రాల రాంబాబు, యెనుముల సత్తిబాబు, జీకురుమెల్లి కిరణ్ కుమార్, కేవీవీ సత్యనారాయణ, గుర్రాల చిట్టిబాబు, నల్లా ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సరస్వతిదేవికి అభిషేకం

పిఠాపురానికి భారీగా తరలిన భక్తులు



సరస్వతిదేవికి అభిషేకం చేస్తున్న స్వామిజీ

పిఠాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ అనఘా దత్త క్షేత్రంలో సరస్వతిదేవికి మూలానక్షత్రం సందర్భంగా తేనె, పాలుతో అభిషేకం నిర్వహించారు. క్షేత్రంలో చాతుర్మాస్య దీక్షలో ఉన్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామిజీ ఈ పూజాధికాలు నిర్వహించారు, నవరాత్రుల సమయంలో సరస్వతి దేవికి విశిష్టస్థానం ఉందని స్వామిజీ తెలిపారు. అమ్మవారిని జ్ఞానస్వరూపిగా అందరు కొలుస్తారని చెప్పారు. హంస వాహనంపై అమ్మవారు ఉంటారని, హంసకు పాలు, నీరుని వేరు చేయగల శక్తి ఉందని తెలిపారు. కార్యక్రమాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా వచ్చారు.



అభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు

ఉప్పాడలో ఎగసిపడుతున్న కెరటాలు



కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో ఉధృతంగా ఉన్న సముద్రం

వాతావరణంలో మార్పులు
ఆందోళనలో మత్స్యకారులు

ఏడాది వేట నిషేధం అనంతరం సముద్రంలో సరైన పాటులేకపోవడంతో తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచు అల్పపీడనాలు, తుఫాన్‌లతో వేటకు వెళ్లకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరిత ఆవర్తనం ప్రభావంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంతం మంగళవారం సాయంత్రం నుంచి ఉధృతంగా మారింది. ఉదయం నుంచీ మధ్యాహ్నం వరకు సముద్రం చాపలా దర్శనమిచ్చింది. సాయంత్రం 5 గంటలు దాటాక సముద్రంలో అలలు క్రమేపీ ఉధృతవుతూ ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఉన్నట్టుండి వాతా వరణం అకస్మాత్తుగా మారడంతో తెల్లారేసరికి వాతావరణం ఎలా ఉంటుందోనని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా



మాయాపట్నంలో మత్స్యకారుల ఇళ్లను తాకుతున్న కెరటాలు

పుల్లల కోసం వెళ్లి.. పుట్టెడు శోకం మిగిల్చి..

ఏలేరు కాలువలో ఇద్దరి మృతి
కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఘటన

ఏలేశ్వరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు కాలువలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయినవారు వరుసకు వదిన, ఆడపడుచు అవుతారు. స్థానికులు, పోలీసులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మందుల కాలనీకి చెందిన పెండ్ర లక్ష్మి (38), పొరుగున ఉన్న పెండ్ర కుమారి (13)తో మంగళవారం పుల్లల కోసం ఏలేరు కాలువ గట్టుకు వెళ్లారు. మంచినీళ్లు తాగేందుకు వెళ్లిన కుమారి కాలువలో మునిగిపోతున్న విషయాన్ని లక్ష్మి గమనించి కాపాడేందుకు వెళ్లింది. ఈక్రమంలో ఇద్దరు కాలువలో గల్లంతయ్యారు. కాలువ వద్దనే దుస్తులు ఉతుకుతున్న కొందరు సమాచారాన్ని కాలనీవాసులు, పోలీసులకు తెలిపారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి గత ఈతగాళ్లతో గాలించగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆ ఇద్దరు చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రామలింగేశ్వరరావు పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.





మరణించిన లక్ష్మి, కుమారి (ఫైల్)

రెండూ పేద కుటుంబాలే..

పెండ్ర లక్ష్మి, అప్పన్న పేద కుటుంబానికి చెందిన వారే. అప్పన్న తలవెంట్రుకలకు సామాన్లు ఇచ్చే వ్యాపారం చేస్తూ భార్య, నలుగురు పిల్లలను పోషిస్తున్నాడు. భార్య గృహిణిగా ఉంటూ కట్టెల కోసం వెళ్లి మృత్యువాత పడింది. భార్య మృతితో పిల్లలకు ఆసరా లేకుండా పోయిందని అప్పన్న విలపిస్తున్నాడు. ఇదే కాలనీకి చెందిన పెండ్ర సత్తిబాబు, అంకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారిలో రెండో కుమార్తె అయిన కుమారి మరణించడంతో ఇంటి పనుల్లో సహకారంగా ఉండేదని గుర్తుచేసుకుని తలిదండ్రులు రోదిస్తున్నారు. పుల్లల కోసం వెళ్లి మృత్యువాత పడటం కుటుంబ సభ్యులకు శోకాన్ని మిగిల్చింది.



రోదిస్తున్న పెండ్ర లక్ష్మి కుటుంబసభ్యులు

ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శ

ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. బంధువులు, పోలీసులను వివరాలు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి న్యాయం చేకూరేలా చర్యలు తీసుకుంటానని ఆమె భరోసా ఇచ్చారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

నర్సింగ్ పరీక్షల మాస్ కాపీయింగ్‌పై...
సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసులు

వారం రోజుల్లో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశం

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) సప్లిమెంటరీ పరీక్షలు కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంసీలో జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే అక్కడ మాస్ కాపీయింగ్ జరుగుతుందని వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన ప్రత్యేక వైద్యాధికారుల కమిటీ సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా మాస్ కాపీయింగ్ జరిగిందని నివేదికను డీఎంఈకి సమర్పించింది. ఈ నేపథ్యంలో వారం రోజుల్లో పు మాస్ కాపీయింగ్‌కు గల కారణాలను రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని డీఎంఈ షోకాజ్ నోటీసులు అందించారు. ఇదిలా ఉంటే ఆర్‌ఎంసీ అధికారులు డీఎంఈకి ఇచ్చిన నివేదిక లో సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా మాస్ కాపీయింగ్ జరిగిందని, అలాగే పరీక్షలు రాసే నర్సింగ్ అభ్య ర్థులు కూర్చునే బెంచీలు కాపీయింగ్‌కు పాల్పడడానికి వీలుగా ఉన్నాయని, పరీక్ష హాల్లోకి వెళ్లేముందు తనిఖీలు చేసే పర్యవేక్షణ కొరవడిందని పేర్కొన్నారు. ఈ నోటీసులు సూపరింటెండెంట్‌తో పాటు డీసీఎస్ ఆర్‌ఎంవో, ఇన్విజిలేటింగ్ సిబ్బంది అందరికి అందజేశారు. అయితే గతంలో మినిస్టీరియల్ సిబ్బందిని ఇన్విజిలేటర్లుగా వేసేవారు. కారణం వారికి నర్సింగ్ సబ్జెక్ట్‌తో సంబంధం ఉండదు. కానీ ప్రస్తుతం ఇన్విజిలేటర్లుగా సుమారు 30 మంది రెగ్యులర్, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను వేయడంతో వారికి నర్సింగ్ సబ్జెక్ట్‌పై అవగాహనా విద్యార్థులకు పరీక్షల్లో సహకరించేందుకు అనువుగా ఉంటుంది. అందువల్ల నర్సులను ఇన్విజిలేటర్లుగా ఎందుకు వేయాల్సి వచ్చిందనే దానిపై కూడా కమిటీ నివేదిక ఇచ్చింది. నర్సులను పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వేయడం వల్ల జీజీహెచ్‌లో రోగుల సేవలకు అంతరాయం ఏర్పడిందని, ఇప్పటికే నర్సుల సంఖ్య తక్కువ కావడంతో వైద్య సేవలు అంతంతమాత్రంగా ఉన్నాయని ప్రజా సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

మహిళపై హత్యాయత్నం
నిందితుడి అరెస్ట్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సహజీవనం చేస్తూ మనస్పర్థల నేపథ్యంలో మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడ్ని తిమ్మాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యారావుపేటకు చెందిన వివాహితతో పరకాలువకు చెందిన మేడిశెట్టి రామకృష్ణ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. వారిద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థలతో ఆమె నెల రోజులుగా రామకృష్ణతో మాట్లాడటం లేదు, ఇంటికి రానివ్వడం లేదు. దాంతో ఆమెపై కక్ష పెంచుకున్న నిందితుడు ఆగస్టు 30వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో కత్తితో వివాహితపై హత్యాయత్నానికి పాల్పడి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలి అరుపులకు చుట్టుపక్కలవాళ్లు రావడంతో నిందితుడు పరారయ్యాడు. తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆమెను మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన తిమ్మాపురం ఎస్‌ఐ వై.గణేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం సూర్యా రావుపేట నేవల్ హెలిపాడ్ సమీపంలో బీచ్‌లో నిందితుడు ఉన్నారన్న సమాచారంతో ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 93మంది హాజరు

రాత్రి వరకూ కొనసాగిన తనిఖీ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా డీఎస్సీ 2025 ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెరిట్ అభ్యర్థుల రెండో విడత సర్టిఫికెట్లు వెరిఫికేషన్ మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి 10గంటల వరకూ జరిగిన ఈ ప్రక్రియకు 93మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎంఈవో, గెజిటెట్ హెచ్‌ఎం, డిప్యూటీ తహశీల్దార్, ఎంఐఎస్ ఆపరేటర్లతో కూడిన 5 తనిఖీ బృందాలు అభ్యర్థుల పరిశీలన చేపట్టారు. సోమవారం సాయంత్రం నుంచి అభ్యర్థులకు కాల్‌లెటర్లు జనరేట్ కాగా వారంతా వచ్చి సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకున్నారు. తనిఖీ వివరాలను ఈ బృందాలు ఆన్‌లైన్ చేశారు. తనిఖీ జరుగుతున్న తీరుని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, డీసీఈబీ కార్యద వెంకట్రావు పరిశీలించగా, గొల్లప్రోలు ఎంఈవో శివప్రసాద్ తదితరులున్నారు.

విమానంలో వచ్చి...

కాల్‌లెటర్లు అయిన అభ్యర్థులు కొంతమంది ఆన్‌లైన్‌లో వాటిని డౌన్‌లోడ్ చేసుకోలేదు. హాజరు కాని వారి వివరాలు గుర్తించిన తనిఖీ బృందాల్లోని ఎంఈవోలు అభ్యర్థులకు ఫోన్‌లో సమాచారం అందించారు. చివరి క్షణంలో సమాచారం అందడంతో హైదరాబాద్‌లో ఉండిపోయిన ఇద్దరు అభ్యర్థులు విమానంలో రాజమహేంద్రవరం వరకూ వచ్చి అక్కడ నుంచి కారులో చేబ్రోలుకు మంగళవారం రాత్రి చేరుకున్నారు. మరో అభ్యర్థి శ్రీకాకుళంలో ఉండగా సమాచారం అందడంతో కారులో నేరుగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న పలువురు ఆలస్యంగానే తనిఖీకి వచ్చారు. రాత్రి పది గంటలకు ప్రక్రియ పూర్తైంది.



వెరిఫికేషన్ కోసం హైదరాబాద్ నుంచి చేబ్రోలుకు వచ్చిన అభ్యర్థిని

కాకినాడలో రెండు రాజకీయ పార్టీలకు ప్రధాన ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన రెండు రాజకీయ పార్టీలకు ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన వెలువరించారు. వీటిలో కాకినాడ ట్రెజరీ కాలనీలో ఉన్న ప్రజా పాలన పార్టీ, కాకినాడ ఎస్.అచ్చుతాపురంలో ఉన్న పేదరిక నిర్మూలన పార్టీలు ఉన్నాయన్నారు. 2019 నుంచి ఆరేళ్లపాటు ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయని, గుర్తింపు పొందని ఈ రాజకీయ పార్టీలకు నోటీసులు ఇచ్చామన్నారు.

చోరీ చేసి చిక్కారు..

రాణేలంకలో ఇద్దరు యువకులను చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగింత



రాణేలంకలో యువకులను చెట్టుకు కట్టిన దృశ్యం

ముమ్మిడివరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి దోపిడీకి పాల్పడిన ఇద్దరు యువకులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాణేలంకలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన చేబోలు సుబ్రహ్మణ్యం తన ఇంటిని అద్దెకు ఇచ్చి అమలాపురంలో ఉంటున్నాడు. ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్నవారు కూడా ఇటీవలే ఖాళీ చేయడంతో ఇంటికి తాళం వేశారు. అయితే సుబ్రహ్మణ్యం తన పాత ఇత్తడి సామాన్లను ఒక గదిలో పెట్టి తాళాలు వేశాడు. మంగళవారం ఉదయం ముగ్గురు వ్యక్తులు మోటారు రిక్షాలో వచ్చి ఇంటి తలుపులను పగులకొట్టి గదిలో ఉన్న పాత ఇత్తడి సామాగ్రిని దొంగిలించుకుపోతుండగా స్థానికులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు దొరకగా మరో వ్యక్తి ఇంజను రిక్షాలో పరారయ్యాడు. వారిని చెట్టుకు కట్టి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి వారిని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి నివారణ చర్యల్లో భాగంగా అల్లూరి జిల్లా డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు డొంకరాయి గ్రామశివారు ఉండి వద్ద మంగళవారం జరిపిన తనిఖీల్లో జెండాకూపి గ్రామానికి చెందిన కిలో సాము వద్ద నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. దీని విలువ రూ.33 వేలు వరకు ఉం టుంది. మధ్యవర్తుల సమక్షంలో ముద్దాయి కిలో సామును రిమాండ్‌కి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఘర్షణపై కేసు నమోదు

రావులపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో తలెత్తిన ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి.. రావులపాలెం మండలం ఈతకోటలో పవన్‌పుట్టినరోజు సందర్భంగా స్థానిక గౌడ రామాలయం వద్ద సైలెన్సర్లు లేకుండా కొంతమంది బైకులతో ర్యాలీ నిర్వహిస్తుండగా, అక్కడున్నవారు ఈ సౌండ్ ఏమిటని ప్రశ్నించారు. దీంతో వివాదం తలెత్తడంతో మట్టా సూర్యనారాయణ, మట్టా సుబ్బలక్ష్మి, మానే ఐశ్వర్యకు గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు కొత్తపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

న్యాయం చేయాలి

- రంపచోడవరంలో విద్యార్థి అనుమానాస్పద మృతిపై కొనసాగుతున్న ఆందోళన
- రెండో రోజూ రోడ్డెక్కిన బాధిత కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘాలు
- ఇంకా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలోనే మృతదేహం .. పూర్తి కాని పోస్టుమార్టం



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు

రంపచోడవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి వివేకానంద రెడ్డి (14) అనుమానాస్పద మృతిపై బంధువులు, ఆదివాసీ సంఘాలు రెండోరోజైన మంగళవారమూ ఆందోళన కొనసాగించారు. విద్యార్థి మరణానికి బాధ్యులైన వారిపై చర్యలు, బాధిత కుటుంబానికి న్యాయం, ఐటీడీఏ నుంచి సరైన స్పందన లేకపోవడంతో రోడ్డెక్కారు. విద్యార్థి అదృశ్యమైంది మొదలు, మరణించే వరకూ తల్లితండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం, విద్యార్థులను పర్యవేక్షించాల్సిన వారెవరూ విద్యార్థులు వాగుకు వెళ్లే సమయానికి లేకపోవడమే సదరు విద్యార్థి మరణానికి కారణమంటూ వారంతా ఆరోపిస్తున్నారు. ఇందుకు బాధ్యులుగా ఐటీడీఏ ఉన్నతాధికారుల నుంచి పాఠశాల వార్డెన్ వరకూ అందరిపైనా క్రిమినల్ కేసులు, మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పరిహారం ఇప్పించాలని డిమాండ్‌చేశారు. కాగా, విషయం తెలుసుకున్న గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వచ్చి మాట్లాడినప్పటికీ ఐటీడీఏ నుంచి స్పందన లేకపోవడంతో సాయంత్రం వరకూ ఆందోళన కొనసాగింది. అయితే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆందోళనకారుల వద్దకు రాలేకపోవడం, ఆదివాసీలు ఎంతకీ ఆందోళన విరమించకపోవడంతో రెండు రోజులైనా మృతదేహానికి శవపరీక్ష జరగకపోవడంతో రంపచోడవరం డీఎస్పీ ప్రశాంతకుమార్ మంగళవారం సాయంత్రం వెళ్లి ఆందోళనకారులతో చర్చించారు. తమకు జరగాల్సిన న్యాయం జరిగేవరకూ తాము తగ్గేది లేదని, ఉన్నతాధికారులతో సహా బాధ్యులందరిపైనా క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన్ని బాధితులంతా కోరారు. దీంతో బంధువులు, ఆందోళనకారులు ఆసుపత్రి వదిలి వెళ్లిపోయారు. విద్యార్థి మృతదేహం ఆసుపత్రి మార్చురీలోనే ఉండిపోయింది. ఇంకా పోస్టుమార్టం పూర్తి కాలేదు. ఆందోళనలో ఆదివాసీ నాయకులు పల్లాల లచ్చి రెడ్డి, వెదుళ్ల లచ్చిరెడ్డి, సీపీఎం కిరణ్, మట్ల వాణిశ్రీ, బాలు అక్కిన, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మలికిపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలంలోని తూర్పుపాలెంలో చోరీకి పాల్పడిన ఆర్.తరఫ్దార్‌ను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ టీ.సురేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం తూర్పుపాలెం బస్టాండు వద్ద తరఫ్దార్‌ను అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి 37 గ్రాముల బంగారం, చోరీ సొత్తును రికవరీ చేసినట్టు తెలిపారు. తరఫ్దార్ జీవనోపాధి నిమిత్తం వెస్ట్‌బెంగాల్ నుంచి వచ్చి తూర్పుపాలెంలో కొన్నాళ్లు చికెన్ షాపు, ఇటుక బట్టీల్లో పనిచేసేవాడు. చోరీ కేసును వెంటనే ఛేదించిన ఎస్‌ఐను జిల్లా ఎస్పీ అభినందించినట్టు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన ఒబిలిశెట్టి రవిచంద్రబాల బాలాజీ-లీలావెంకట సత్యవాణి దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు.

ప్రసవ వేదన

- ఆదివాసీ మహిళకు పురిటి నొప్పులు
- ఆసుపత్రికి తరలించేందుకు నానా అగచాట్లు
- కూనవరం మండలం వలస ఆదివాసీ గ్రామం కన్నాపురంలో ఘటన

కూనవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అడవి, కటిక చీకటి, జోరు వాన, వెలుతురు లేకపోవడంతో సెల్‌ఫోన్ లైట్ సాయం... వీటన్నింటి మధ్య ఓ గిరిజన మహిళ ప్రసవం.. ఇన్ని అవరోధాలు ఎదుర్కొని ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే ... కూనవరం మండలంవలస ఆదివాసీ గ్రామమైన కన్నాపురంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆది వాసీ మహిళ రవ్వ దేవమ్మకు సోమవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో నరకయాతన పడింది. కాగా, ఆసుపత్రికి తీసుకెళ్దామంటే ఆ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేదు. అయితే ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మైదాన ప్రాంతంలో ఉన్న నర్సింగపేట వచ్చి అక్కడి ఆశా వర్కర్‌కు సమాచారం అందించాడు. దీంతో ఆమె 108కు ఫోన్ చేయగా వాహనం రాగానే ఆమెను ఎక్కించుకుని వెళ్తుండగా సదరు వాహనం సగం దూరం వెళ్లి ఆగిపోయింది. దీంతో రామ్మోహనరావు, ఆశ వర్కర్ లక్ష్మి నడుచుకుంటూ కన్నాపురానికి చేరుకుని దేవమ్మకు ప్రథమ చికిత్స అందించిన అనంతరం ఆమెను నడిపించుకుంటూ తిరిగి బయలుదేరారు. కాగా రహదారి గుంతలుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చింది. ఈ లోగా దేవమ్మకు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీనికి తోడు జోరు వాన మొదలవడంతో గొడుగు పట్టుకుని సెల్‌ఫోన్ లైట్ సహాయంతో దట్టమైన అడవిలో ప్రసవించే విధంగా చికిత్స ప్రారంభించారు. చివరకు మగ బిడ్డకు జన్మనివ్వడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం ఆమెను, పసిబిడ్డను కూనవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం తల్లీ, బిడ్డా క్షేమంగా ఉన్నారు.



ప్రసవించిన తర్వాత దేవమ్మ, పసిబిడ్డను 108లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

చెందుర్తిలో యూరియా కోసం వాగ్వాదం

గొల్లప్రోలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. దీనికోసం తోపులాటలు, వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. గొల్లప్రోలు మండలం చెందుర్తి లోని రైతుసేవా కేంద్రానికి మంగళవారం యూరి యా స్టాకు వస్తుందనే సమాచారం రావడంతో చెందుర్తి, పరిసర ప్రాంతాల రైతులు భారీగా చేరుకున్నారు. తీరా లారీ ఎంతకీ రాకపోవడం, వచ్చినా సకాలంలో పంపిణీ చేపట్టకపోవడంతో తెల్లవారుజాము నుంచి పడిగాపులు కాసిన రైతులు సహనం కోల్పోయారు. దీంతో తోపులాటలు, వాగ్వాదాలు జరిగాయి. 20 టన్నుల యూరియా వచ్చినప్పటికీ సగం మంది రైతులకు కూడా సరిపోకపోవడంతో ... అందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపిణీ సక్రమంగా చేయడం లేదని వారంతా మండిపడ్డారు. తీసుకున్న వారే మరలా తీసుకుంటున్నారని ఆరోపించారు.



రైతుల మధ్య తోపులాట

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

- రైలు ఢీకొని ఒకరు ... రోడ్డు ప్రమాదంలో గాయపడి మరొకరు ... శబరి, గోదాట్లో మరో ఇద్దరు ...

కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, పశివేదల రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఉదయం గుర్తుతెలియని దాదాపు 45 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్‌ఐ పి.అప్పారావు తెలిపారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతడి ఒంటిపై తెలుపురంగు చిన్నచారలు కలిగిన పొడవు చేతుల షర్ట్, ఆకుపచ్చ రంగుపై ఎరుపురంగు పువ్వుల డిజైన్ లుంగీ, రంగుల టర్కీ టవల్ ఉన్నాయన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 9490617090, 99480 10061 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

అలమూరు: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఆలమూరు ఎస్‌ఐ జీ.నరేష్ తెలిపారు. వివరాలివి... రావులపాలెం మండలం రావులపాడుకి చెందిన కటకం మోహనరావు (52) రాజమహేంద్రవరం నుంచి బైక్‌పై రావులపాడుకు వస్తుండగా ఆలమూరు మండలం జొన్నాడ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గాయపడిన మోహనరావును రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తుతెలియని మృతదేహం

వీఆర్‌పురం : శబరి నదిలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. ఈ సంఘటన వీఆర్‌పురం మండలంలో మంగళవారం జరిగింది. వీఆర్‌పురం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధిలోని పత్తిపాక శివారులోని వరద నీటిలో మృతదేహం (పురుషుడు) కొట్టుకు వచ్చిందని, వయస్సు సుమారుగా 30 నుంచి 35 వరకు ఉంటుందన్నారు. మృతుడు ఎరుపురంగు షాట్ మాత్రమే ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. అలాగే నడుముకు పసుపు, ఎరుపు రంగు మొలతాడు కలిగి ఉన్నాడని, ఎవరైనా గుర్తుపడితే ఫోన్‌నెంబర్లు 9490617851, 95994 99366 కు తెలియచేయాలన్నారు.

మామిడికుదురు: గోదావరి నదిలో వృద్ధుడు గల్లంతైన సంఘటన మంగళవారం జరిగింది. బి.దొడ్డవరం గ్రామానికి చెందిన ఒలుపు కార్మికుడు రవణం సాయిబాబు (78) బహిర్భూమికి వెళ్లి గోదావరి నదిలో కొట్టుకుపోయినట్టు కుటుంబ సభ్యులు తెలియజేశారు. గల్లంతైన మృతుడి కోసం రెండు పడవల సహాయంతో రెవెన్యూ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఏవిధమైన ఆచూకీ తెలియరాలేదు. దీనిపై సాయిబాబు కుమారుడు పల్లంరాజు పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

హత్యా నేరం కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు, జరిమానా

- తాడేపల్లిగూడెం కోర్టు తీర్పు

నల్లజర్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం చీపురుగూడెంకి చెందిన చల్లారి వెంకట్రావును అదే గ్రామానికి చెందిన కూసపం బాబూరావు 2021లో ఇనుప రాడ్డుతో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కోర్టు విచారణ అనంతరం నేర రుజువు కావడంతో మంగళవారం తాడేపల్లిగూడెం కోర్టు బాబూరావుకు ఏడేళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధించి నట్టు నల్లజర్ల పోలీసులు తెలిపారు. అప్పట్లో వెంకట్రావు ఇంటి వద్ద కల్లు దుకాణం ఉండేది... అక్కడకి కల్లు తాగడానికి వచ్చిన బాబూరావును డబ్బులు అడగ్గా... ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువురూ కొట్టుకున్న సమయంలో బాబూరావుకు పక్కనే ఉన్న ఇనుప రాడ్డు చేతికి అందడంతో వెంకట్రావు తలపై కొట్టడంతో మృతిచెందాడు.

భక్తులతో కిటకిటలాడిన బిక్కవోలు



గణపతి దర్శనానికి బారులు దీరిన భక్తులు

శ్రీలక్ష్మీగణపతికి పూజలు

బిక్కవోలు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా ఏడో రోజైన మంగళవారం బిక్కవోలులోని ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి బారులు దీరి స్వామిని దర్శించుకున్నారు. యానాంకు చెందిన కంచర్ల వెంకటనాగేశ్వరరావు అన్నపూర్ణ దంపతులు అన్నదాన ఏర్పాట్లు చేశారు.అనంతరం భక్తులు గ్రామంలోని గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లను దర్శించారు. లక్ష్మీగణపతికి అర్చకులు గణపతి హోమం, మూలమంత్ర పూజలు మంత్ర జపతర్పణ, హోవనాలు, ఉపషనిత్తు పారాయణాలు జరిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, సభ్యులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి,ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు. బలభద్రపురంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చవితి ఉత్సవాల్లో వినాయకుడిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ ఎన్‌వీ సుబ్బారెడ్డి దర్శించుకున్నారు. వారిని ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించింది.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు పథకం అమలు చేయడం వల్ల జిల్లాలోని ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీరికి వెంటనే ఉపాధి కల్పిస్తూ నెలకు రూ.10,000 ఆర్థిక సాయం అందజేయాలని కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం అమలు సంతోషమే అయినా ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాల్సి ఉందని అన్నారు. ఆందోళనలో పాల్గొనకుండా ఆటో డ్రైవర్లను పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు జేటీ రామారావు, శ్రీనివాస వడయార్, మోతా శారద, తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు సహాయం చేయాలి

● ఎంపీ పురందేశ్వరి
● వడిశలేరులో పోతుల వెంకట రాయుడు చెరువు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ పురందేశ్వరి

రంగంపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జీఎస్ఎల్ సంస్థ అధినేత గన్ని భాస్కరరావును ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ తమ ప్రాంతంలోని పేదలకు సహాయం చేయాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.మండలంలోని వడిశలేరులో ఏడీబీ రోడ్డును ఆనుకొని ఉన్న పోతుల వెంకటరాయుడు చెరువును గన్ని భాస్కరరావు అభివృద్ధి చేశారు. దాని ని మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, గన్ని భాస్కరరావు, గన్ని కృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షు డు పిక్కి నాగేంద్రతో కలిసి పురందేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సుమారు 400 ఎకరాలకు సాగునీటిని అందించే వెంకటరాయుడు చెరువును అభివృద్ధి చేసిన గన్ని కుటుంబ సభ్యులను ఆమె అభినందించారు. పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ఎంపీ పురందేశ్వరి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పాటకు ప్రాణం పోసిన గాయకుడు ఎస్పీ బాలు

ధవళేశ్వరం,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ సంగీతంలో ప్రవేశం లేకపోయినా తన గాన మాధుర్యంతో పాటకు ప్రాణం పోసిన గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.ధవళేశ్వరంలోని ఇరిగేషన్ పార్కులో ఆవిష్కరించిన ఎస్పీబీ విగ్రహాన్ని మంగళవారం ఉదయం ఆమె సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అనేక అవార్డులు గెలుచుకున్న బాలు అవార్డులకే ఆభరణం లాంటివారని ప్రశంసించారు. 5 దశాబ్దాలుగా అనేకభాషల్లో పాటలు పాడి సంగీత అభిమానుల మదిలో చిరస్మరణీయుడిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరిని నటుడు శుభలేఖ సుధాకర్, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్, రాక సంస్థ అధ్యక్షుడు కంటే వీరన్నచౌదరి, జీవీ రమణ, యర్రమోతు ధర్మరాజు తదితరులు సత్కరించారు.

నన్నయలో పొలిటికల్ సైన్స్‌ను కొనసాగించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మెయిన్ క్యాంపస్‌లో ఎంఏ పొలిటికల్ సైన్స్ గ్రూపును యథావిధిగా కొనసాగించాలని విద్యార్థి, యువజన, దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఆనం కళాకేంద్రం సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ కోనసీమ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్, ఏఎస్ఎఫ్ నాయకులు తాడేపల్లి విజయ్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, దళిత సంఘాల నాయకుడు కోరుకొండ చిరంజీవి, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పి.వేణుగోపాల్, జే.సుబ్బారావు, ఎస్.విజయకుమార్, ఎస్ఎస్‌యూఐ నాయకులు తారకేష్, రెల్లి సంఘం నాయకులు నీలం వెంకటేశ్వరరావు, దళిత ప్రజా సంఘం నాయకులు నక్కా వెంకటరత్నం, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు టి.అరుణ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పూర్ణిమరాజు తదితరులు మాట్లాడారు. నన్నయ వర్శిటీలో ఈ విద్యాసంవత్సరం నుంచి పొలిటికల్ సైన్స్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తున్నామని, ఉద్దేశ్యపూర్వకంగానే చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం దీనిపై వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో దశల వారీ ఉద్యమం నిర్వహిస్తామని ప్రకటించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన నలుగురి అరెస్టు

గోకవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయకుడి నిమజ్జనానికి వెళ్తుండగా జరిగిన ఘర్షణలో కత్తితో దాడి చేసిన నలుగురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.ఆగస్టు 31న గంగవరం మండలం ఓజుబంద గ్రామం నుంచి వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా వెళ్తుండగా గోకవరం మండలం కృష్ణునిపాలెం శివారు రామన్నపాలెం హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి ఊరేగింపులో ఉన్న కుంజం భరత్‌ను గోకవరం గ్రామానికి చెందిన చెందిన గేదెల శివనందు, రాయి అచ్చారావు, పీఎన్‌వీఎస్‌పీ కామేష్, ఎంవీవీ దుర్గాప్రసాద్ కోడి కత్తితో బెదిరించి అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కునే ప్రయత్నం చేశారు. దీంతో వారిని ప్రతిఘటించగా భరత్‌తో పాటు రాజేష్ అనే వ్యక్తిపై ఆ నలుగురు వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన నలుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

వైఎస్సార్ వర్ధంతి

నివాళులర్పించిన పలువురు వైసీపీ నాయకులు

రాజానగరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని రాజానగరంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ జంక్షన్‌లోని రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి గౌతంరెడ్డి, శ్రీనివాస్‌నాయుడు, తలారి వెంకటరావు, జక్కంపూడి రాజా, నాయకులు జక్కంపూడి గణేష్, షర్మిలారెడ్డి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాలలతో నివాళులర్పించారు.

రంగంపేట: మండలంలోని వడిశలేరు, రంగంపేట, మర్రిపూడి, దొడ్డిగుంట, సుభద్రంపేట, వీరంపాలెం గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పోతుల బుల్లివీర్రాజు,కొల్లాటి ఇశ్రాయేలు, నలమాటి బులిరాజు,భీముడు పాల్గొన్నారు.

గోకవరం: గోకవరంలోని పాతబస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైసీపీ నాయకులు పూలమాలలతో నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సుంకర రమణ,బాడితబోయిన చిన్న, సుంకర వీరబాబు,బిజ్జి రాజు, బొర్రా శేఖర్, షేక్ వల్లీ, బొడ్డపాటి వీరచంద్రం పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం: బత్తుల

కోరుకొండ సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఆర్యవైశ్య సంఘం మండల సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన ఆర్యవైశ్య సంఘ మండల గౌరవాధ్యక్షులు కటకం చలం, సత్యవరపు కొండ, అధ్యక్షుడు ఓలేటి సూర్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి కప్పల స్వామి, ఇతర ఉపాధ్యక్షులు, కోశాధికారులు, కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. ఆర్యవైశ్యులు సాంప్రదాయ పద్ధతులు పాటించడంలో ముందుంటారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, మహాసభ నాయకులు పాల్గొన్నారు.

కూటమి ఏర్పాటులో

పవన్ కీలకం

» రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగాలి
» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
» ఘనంగా డిప్యూటీ సీఎం పుట్టినరోజు
» జనసేన నాయకుల వేడుకలు
» పలుచోట్ల సేవా కార్యక్రమాలు

బిక్కవోలు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడడానికి ముఖ్య భూమిక పవన్‌కళ్యాణ్ పోషించి కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషించారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం జనసేన పార్టీ నేతల ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుతో జనసైనికులు కేకుకట్ చేసి అందరికీ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండి రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగేలా చూడాలన్నారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యకర్తలందరికీ పార్టీ పదవులు రాలేదని దిగులు చెందవద్దని, అందరినీ కలుపుకుని పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. తల్లి, తండ్రి లేని ఐదుగురు పిల్లలకు రూ.10 వేలు చొప్పున, మరో ఐదుగురు పిల్లలకు రూ.5 వేలు చొప్పున జనసైనికులు సమకూర్చిన చెక్కులను ఎమ్మెల్యే, మర్రెడ్డి కలసి అందజేశారు. అనంతరం రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన కర్రి సత్యగౌరిని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని, టీడీపీ ఇన్‌చార్జి మనోజ్, ఎంపీపీ తేతలి సుమ, మాజీ ఎంపీపీ బేరా వేణమ్మ, పడాల రాములను సత్కరించారు. వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రావాడ నాగు, పల్లి వాసు, ఇందల వీరబాబు, కర్రి శ్రీనివాసరావు, తోట సతీష్, మేడిపూడి వీరబాబు, తోట సతీష్, బిట్టు సీఐ సుమంత్, ఎస్ఐ రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.రంగాపురంలో జనసేన కోఆర్డినేటర్ రావాడ నాగు, మండలాధ్యక్షుడు ఇందల వీరబాబు కేకు కట్ చేశారు. అనంతరం గ్రామంలోని 4 అంగన్వాడీ కేంద్రాలకు, ఒక హెల్త్ సెంటర్‌కు మూడేసి చొప్పున కుర్చీలను బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేతా ఏసురత్నం, నక్కా దాసు, తుట్టా శివ, లోవకుమారి, సాయిరాజు, కానాటి అప్పలస్వామి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ బోధనాసుపత్రిలోని ప్రసూతి విభాగంలో మహిళలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. బాలింతలకు ప్రత్యేక ఆహార పదార్థాలను అందజేశారు. జనసేన సిటీ అధ్యక్షుడు వై.శ్రీను, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. దేవీచౌక్ సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద భవన నిర్మాణ కార్మికులకు అల్పాహార వితరణ చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, వై.శ్రీను ముఖ్య అతిథులుగా విచ్చేశారు. గోదావరి తీరాన ఉన్న శంకర మఠంలో వేదపండితుల ఆశీర్వచన కార్యక్రమం నిర్వహించారు. నందం గనిరాజు జంక్షన్ వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, పవన్ కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని జి.దొంతమూరు శివారు బాలవరంలో జనసేన నాయకుడు గుబ్బల రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు.అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రావాడ నాగు, పడాల రాము, కూటమి నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

కడియం: మండలంలోని బుర్రిలంక వీఎస్ఎం కన్వెన్షన్ హాలులో చిరు సేవా సమితి నిర్వాహకుడు గెడ్డం శివరత్న గణపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి పవన్‌కల్యాణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు.ధన్వంతరి, సత్యసూర్య బ్లడ్ బ్యాంక్‌లు రక్తదాతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 308 మంది రక్తదానం చేశారు. వైద్య శిబిరంలో ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం చిరు సేవా సమితి బృందం పురందేశ్వరిని సత్కరించారు. బృంద సభ్యులు శివను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారిశెట్టి పద్మావతి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, గట్టి నర్సయ్య, పాటంశెట్టి రాంజీ, గట్టి సుబ్బారావు, యర్రా వేణుగోపాలరాయుడు, వై.శ్రీను, గాద గోపాలకృష్ణ, పంతం గణపతి, మల్లు పోలరాజు పాల్గొన్నారు. వీరవరం, పొట్టిలంక గ్రామాల్లో అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్లు కందుల కృష్ణతేజ, గోరంట్ల రవిరామ్‌కిరణ్ ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో ఆదిమూలం సాయిబాబా, అన్నందేవుల చంటి, ముద్రగడ జమీ, కామిరెడ్డి సతీష్, వెలుగుబంటి ప్రసాద్ పాల్గొన్నారు. కడియపుసావరంలో సర్పంచ్ చెక్కపల్లి మురళి ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. వేమగిరిలో జనసైనికుడు అల్లంపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కడియం సీహెచ్‌సీలో రోగులకు పండ్లు అందజేసారు. కార్యక్రమంలో అల్లంపల్లి ప్రసాద్, ముద్రగడ జమీ, పుల్లెపు మూర్తి, జంగా వినోద్, కొప్పిశెట్టి రాజేష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తి దేవీ చౌక్ వద్ద జనసేన ఆధ్వర్యంలో జరిగిన నిర్వహించిన వేడుకలలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జనసైనికులు భారీగా బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు ఎస్ఆర్‌కే ప్రసాదరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి, శివన్నారాయణ పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో జనసేన పార్టీ నా సేన నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, వీర మహిళలు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.అనంతరం పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం జనసేన కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. బూరుగుపూడిలో కన్నా ఆశ్రయ ఫౌండేషన్ వద్ద మానసిక దివ్యాంగుల పాఠశాల వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముక్కా రాంబాబు, అడ్డాల శ్రీనివాస్, బదిరెడ్డి దొర, బత్తుల గోపాలకృష్ణ, చదువు ముక్తేశ్వరరావు, మట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గోకవరం: గోకవరంలో పవన్ అభిమానులు భారీ కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. వీరలింకపల్లిలో జరిగిన కార్యక్రమానికి జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ విచ్చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విచ్చేసి అభిమానుల మధ్య కేక్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మదర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ పవన్‌లోని ధైర్యం, పట్టుదల, పోరాట పటిమ మనందరిలో ఉండాలని అభిమానులను ఉద్దేశించి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, జనసేనపార్టీ జిల్లా కార్యదర్శి కిమిడి శ్రీరామ్, యర్రంశెట్టి శ్రీను, మద్దిరెడ్డి బాబులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో చిరుసేవా సమితి అధ్యక్షుడు గెడ్డం శివ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు విచ్చేసి ప్రారంభించారు.శివ బృందాన్ని అభినందించారు. అలాగే చిరంజీవి యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి ఆధ్వర్యంలో బొమ్మూరు వృద్ధాశ్రమంలో నిత్యావసర వస్తువులు అందించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో చైతన్య, హరీష్, వర్రే రాజేష్‌నాయుడు, లక్ష్మణ్, రవితేజ, ధనరాజ్ పాల్గొన్నారు.



శ్రీకృష్ణపట్నంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల



బిక్కవోలులో బాలికకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



బుర్రిలంకలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ పురందేశ్వరి

నగరంలో రూ.102 కోట్ల అభివృద్ధి పనులు

» **కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే వాసు**



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):నగరంలో వివిధ దశల్లో ఉన్న రూ.102 కోట్ల అభివృద్ధి పనుల ప్రగతిపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అధికారులను ఆరా తీశారు. మంగళవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడారు. నగరంలోని జేఎన్ రోడ్డు ఎత్తు పెంచాలని ఆదేశించారు. నగరంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.నగరంలో అధిక వర్షాల కారణంగా రోడ్లు గుంతలు పడ్డాయని అటువంటివి 567 గుర్తించామని, వాటిని మరమ్మతులు చేయాలని ప్రతిపాదనలు చేశామని రూ.1.20 కోట్లతో టెండర్లు పిలిచినట్టు చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే మూడో వారంలో పనులు ప్రారంభిస్తారని చెప్పారు. మోరంపూడి ఫ్లైఓవర్‌కు సంబంధించి రెండు సర్వీసు రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయిస్తున్నారని, ఈ నెల 15కు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నెలాఖరుకు పనులు చేపడతామన్నారు. స్థానిక ఇందిరానగర్‌లో పార్కులో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ సమస్య లేకుండా జంక్షన్లు అభివృద్ధి చేస్తామన్నారు. నందం గనిరాజు జంక్షన్, తాడితోట జంక్షన్, హ్యాపీస్ట్రీట్, సీతంపేట వాటర్ ట్యాంక్‌ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఈ పనులు అన్ని వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సిటీ ప్లానర్ కోటయ్య, ఇన్‌చార్జి ఎస్ఈ రీటా, టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధా, కొయ్యల రమణ తదితరులు పాల్గొన్నారు.

దుళ్ల మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు మృతి



కడియం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుళ్ల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దూడల నాగేశ్వరరావు(66) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు.కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన దుళ్లలోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. నాగేశ్వరరావుకు భార్య, కుమార్తె ఉన్నారు.ఆయన 1996-2001లో సర్పంచ్‌గా చేశారు.చివరి వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగారు. నాగేశ్వరరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, బిక్కిన కృష్ణార్జునచౌదరి, కడియం, ఆలమూరు మండలాలకు చెందిన పలువురు ప్రస్తుత, మాజీ సర్పంచ్‌లు సంతాపం తెలిపారు.

అనుమతుల్లేకుండా నిర్మించొద్దు

సీతానగరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయతీ అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు.మంగళవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో అనుమతులు లేకుండా జరుగుతున్న భవన నిర్మాణాన్ని ఆయన నిలిపివేశారు. సర్వే నెం 81 గ్రామకంఠం అని రికార్డుల్లో చూపుతోందన్నారు.

జీజీయూలో సినిమా

షూటింగ్ సందడి

రాజానగరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంఏ ఆర్ట్స్ బ్యానర్‌పై రూపుదిద్దుకుంటున్న సినిమా చిత్రీకరణతో జీజీయూలో సందడి నెలకొంది. ఈ సినిమాలో హీరోలుగా ధనుష్ రఘుముద్రి, వంశీ నల్లమిల్లి, హీరోయిన్‌లుగా శ్రీ, షలాకారెడ్డి నటిస్తున్నారు. నటుడు జెమిని సురేష్, హీరో ధనుష్ రఘుముద్రి తదితర నటులపై కళాశాలకు సంబంధించిన పలు సన్నివేశాలను చిత్ర రచయిత, దర్శకుడు శివ కాగితపు మంగళవారం చిత్రీకరించారు. ఈ ఏడాది డిసెంబరు 25న సినిమాను విడుదల చేయాలని భావిస్తున్నామ శివ చెప్పారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో

విద్యార్థిని ప్రతిభ

అనపర్తి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలంలో జరిగిన 11వ సీనియర్ ఇంటర్ బాల్ బాడ్మింటన్ పోటీల్లో అనపర్తి జీబీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని బి.ప్రసన్న భార్గవి జట్టు విజయానికి విశేష కృషి చేసి జట్టు తృతీయ స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించినట్టు ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో భార్గవితోపాటు యానాంలో జరిగిన ఓపెన్ బాల్‌బ్యాడ్మింటన్ ప్రతిభ కనబరిచిన వీహెచ్ దుర్గాప్రసాద్‌లను అభినందించారు. కరస్పాండెంట్ తేతలి కొండబాబు, ప్రిన్సిపాల్ ఎన్.పెదఅబ్బాయిరెడ్డి, పీడీ మహేంద్రరెడ్డి, కె.రాజు, టి.విజయ్ పాల్గొన్నారు.

ములకల్లంకలో వైద్య శిబిరం

సీతానగరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ములకల్లంక గ్రామస్థులందరూ ఆరోగ్యంగా ఉన్నారని బొబ్బిల్లంక పీహెచ్‌సీ డాక్టర్ యేసు రాణి అన్నారు. మంగళవారం ములకల్లంక గ్రామంలో వరద పరిస్థితుల దృష్ట్యా వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.

సచివాలయాల పనితీరు పర్యవేక్షిస్తుండాలి

కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలో వార్డు సచివాలయాల పనితీరును ఎప్పటికప్పుడు నోడల్ అధికారులు పర్యవేక్షిస్తుండాలని కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి సూచించారు.కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నోడల్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో చెత్త సేకరణతో పాటు రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సరఫరాలో వచ్చే సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌లో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కలెక్టర్ సూచించారు. డ్రైన్లు ఆక్రమణలకు గురికాకుండా చూడాలన్నారు. కాలువలు, కుంటల్లో ఆయిల్‌బాల్స్, రసాయనాలు పిచికారీ చేయించాలని సూచించారు. స్థానిక రెసిడెన్షియల్ సొసైటీ సభ్యులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్,డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఆవిర్భావ వేడుకలు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మోరంపూడి జంక్షన్ వద్ద జీవిత బీమా డివిజనల్ కార్యాలయంలో జీవిత బీమా ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన గెయిల్ చీఫ్ మేనేజర్ కేవీఎస్ రావు జ్యోతి ప్రజ్వలన చేశారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ ఎల్ఐసీ 69 వసంతాల ప్రయాణాన్ని వివరించారు. డిజిటలైజేషన్‌లో భాగంగా ఎల్ఐసీ తమ పాలసీదారుల కోసం ఒకయాప్‌తో ముందుకు వస్తోందన్నారు. వివరించారు. కేవీఎస్ రావు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో ఎల్ఐసీకి భాగస్వామ్యం ఉందన్నారు. ఈ నెల 7 వరకు జరిగే ఆవిర్భావ వారోత్సవాల్లో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు, ఉద్యోగులకు,ఏజంట్లకు హెల్త్ వాక్ అండ్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సాహూ పేర్కొన్నారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి: ఎస్ఐ

అనపర్తి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనంలో ఎటువంటి అపశ్రుతులు చోటు చేసుకున్నా పూర్తి బాధ్యత ఉత్సవ కమిటీలదేనని ఎస్ఐ శ్రీను నాయక్ అన్నారు. మంగళవారం ఆయన తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డిలతో కలిసి అనపర్తిలో నిమజ్జనం జరిగే రేవులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కాలువలు ఉధృతంగా ఉన్న నేపథ్యంలో నిమజ్జనం జరిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మద్యం తాగి నిమజ్జనంలో పాల్గొనే వారిని దూరంగా ఉంచాలన్నారు.

పెన్షనర్ల సంఘ భవనాభివృద్ధికి సహకరించండి

ధవళేశ్వరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలోని పెన్షనర్ల సంఘ భవన అభివృద్ధికి సహకరించాలని ఎంపీ పురందేశ్వరికి అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ధవళేశ్వరం యూనిట్ పెన్షనర్ల సంఘంలో 300 మంది పైగా రాష్ట్ర పెన్షనర్లు సభ్యులుగా ఉన్నారని, ప్రస్తుతం ఉన్న భవనం సరిపోవడం లేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. భవనంపై మరో అంతస్తు నిర్మాణానికి సహకరించాలని అభ్యర్థించారు. ఎంపీ మాట్లాడుతూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీని పెన్షనర్ల సంఘం యూనిట్ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వర శర్మ, టి.కేశవరావు తదితరులు సత్కరించారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సుందరకాండ
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలస్	: సుందరకాండ
స్వామి	: కూలీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: త్రిబాణధారి, బార్బరిక్
శివజ్యోతి	: బ్రహ్మాండ, తమ్ముడు
రాజా	: సుందరకాండ
ఊర్వశి	: కుబేర
మేనక	: సు ఫ్రం సో
రంభ	: మహావతార్ నరసింహ
అప్సర	: కొత్తలోక
అశోక	: వార్-2
వీఎస్ మహల్(నామవరం)	: మహావతార్ నరసింహ
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కొత్తలోక
వెంకటసూర్య(కడియం)	: కూలీ
సత్యగౌరి (అనపర్తి)	: కూలీ
సూర్యశ్రీ (అనపర్తి)	: సుందరకాండ
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కొత్తలోక
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: కొత్తలోక
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కూలీ, సుందరకాండ
లలితామహల్(రంపచోడవరం)	: మహావతార్ నరసింహ
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు



హ్యాపీ బర్త్‌డే సార్!

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు.. ఆయన అభిమానులు కేకులు కట్ చేసి పండుగ చేసుకున్నారు.. మంత్రి కందుల దుర్గేష్ అమరావతిలో మంగళవారం పవన్ కల్యాణ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు..





రాజమండ్రిలో వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టనున్నారు.. ప్లాస్టిక్ బాటిల్ ఆకారంలో ఇలా తయారుచేయించి జంక్షన్లలో ఏర్పాటు చేయనున్నారు.. వాడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు అందులో వేసేలా అవగాహన కల్పించనున్నారు.

ఇలా.. చేస్తే ఎలా!

గోదావరి రివర్ ఫ్రంట్ పనులను మంగళవారం ఎంపీ పురందేశ్వరి పరిశీలించారు.. నత్తనడకన సాగుతుండడంపై అధికారులను ప్రశ్నించారు.. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.. ఆమె వెంట ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఉన్నారు..



శాంతించినది!

8

గోదావరి తగ్గుముఖం పట్టింది.. ధవళేశ్వరం వద్ద మంగళవారం మొదటి ప్రమాద హెచ్చరికను ఎత్తివేశారు.. దీంతో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజానీకం ఊపిరిపీల్చుకున్నారు.. లంకలు మెల్లమెల్లగా తేరుకుంటున్నాయి..



భూ..తాలు!

ఫ్యాన్ కేటాయింపు.. అక్రమాల కంపు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రభుత్వశాఖలకు ఉచితంగా కేటాయించిన భూములు చాలా వరకు పరాధీనమయ్యాయి. కేటాయించిన అవసరాలకు బదులు పలువురు నేతల కబ్జాల్లోకి వెళ్లిపోయాయి. పేరుకు బయటకు ప్రభుత్వ శాఖల అవసరాలకు ఉచితంగా కేటాయిస్తే వాటిని అనేకచోట్ల చెరబట్టి దారి మళ్లించేశారు.గత వైసీపీ సర్కారు హయాంలో అలియ నేషన్ పేరిట విలువైన ప్రభుత్వ భూములు వివిధ శాఖల అవసరాలకు ఉచితంగా కేటాయించగా,వాటిలో చాలా వరకు ఆపార్టీ నేతలే వాలిపోయి ఎంచక్కా అనుభవిస్తున్నారు. లీజులకు ఇచ్చేసి అడ్డగోలుగా జేబులు నింపేసుకుంటున్నారు. సబ్‌స్టేషన్లు, స్కూళ్లు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, బల్క్‌మిల్క్ సెంటర్లకు ఇచ్చిన స్థలాల్లోను పాగా వేసేశారు. ఈ తరహా కబ్జాలపై ప్రభుత్వం తాజాగా దృష్టిసారించింది. ఇంతవరకు ఎన్ని భూములు ఇలా కేటాయించరనేదానిపై నివేదికలు రప్పిస్తోంది. గడచిన ఐదేళ్లలో 5,700 ఎకరాల వరకు కేటాయించినట్టు ప్రభుత్వానికి నివేదికలు సిద్ధం చేశారు.

విలువైన భూములు ఉచితంగానే..

రెవెన్యూశాఖ ఆధీనంలో ఉమ్మడి జిల్లాలో కోట్ల విలువైన వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. వీటిని ప్రభుత్వాలు రకరకాల అవసరాల పేరుతో వినియోగించుకుంటున్నాయి. ఇతర ప్రభుత్వ శాఖలకు కావాలంటే రెవెన్యూ శాఖ నుంచి ఉచితంగా అలియనేషన్ కింద ప్రభుత్వం కేటాయిస్తూ వస్తోంది. కొన్ని కంపెనీలకు కావాలంటే ధర నిర్ణయించి వసూలు చేసి వాటికి కేటాయిస్తున్నాయి. ఇలా అలియనేషన్ కింద వివిధ ప్రభుత్వశాఖలకు ఉచితంగా కేటాయిస్తోన్న భూములు కాలక్రమేణా కబ్జాలకు గురవుతున్నాయి. కొందరు పలుకుబడి కలిగిన నేతలైతే ప్రభుత్వ శాఖల పేరుతో భూములు ఉచితంగా కొట్టేసి ఆనక వాటిలో పాగా వేసేస్తున్నారు. వీటిని వ్యాపార అవసరాలకు కేటాయించడం, సొంత వ్యాపారాలకు గోదాములు నిర్మించడం వరకు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రధా నంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి.



అప్పట్లో జగన్ సర్కారు కొత్తగా తెచ్చిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్, చిల్లింగ్ కేంద్రాలకు ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అలియనేషన్ విధానంలో ఉచితంగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీశాఖ, పశుసంవర్ధకశాఖలకు కేటాయించేశారు. కాలువల వెంబడి భూములను ఎడాపెడా ఇచ్చిపారేశారు.వీటిని కేటాయించిన అవసరాలకు కాకుండా ఆ ముసుగులో కొందరు వైసీపీ నేతలు మూడు జిల్లాల్లో పలుచోట్ల వాటిలో పాగా వేసేసి సొంత అవసరాలకు వాడుకుంటు న్నారు.దీంతో ప్రస్తుత ప్రభుత్వం వీటిపై కన్నేసింది. గత ఐదేళ్లలో ఏయే శాఖలకు వీటిని ఎంతెంత విస్తీర్ణంలో కేటాయించారు? వాటిలో అసలు ఎవరుంటున్నారు? ఆయా శాఖల అవ సరాలకు నిజంగానే వీటిని వాడుతున్నారా? లేదా? అనేదానిపై పూర్తిస్థాయిలో నివేదికలు పంపాలని కోరింది. మండలాల వారీగా

- ప్రభుత్వ భూమి.. ప్రైవేటు లొసుగు
- భూకేటాయింపుల్లో అక్రమాలెన్నో
- గత ప్రభుత్వంలో విచ్చలవిడితనం
- 5,700 ఎకరాలు పరాదీనం
- భూముల్లో వైసీపీ నేతల పాగా
- దృష్టిపెట్టిన కూటమి ప్రభుత్వం
- జిల్లాల వారీగా నివేదికలు సిద్ధం
- అనేక చోట్ల అడ్డగోలు వ్యాపారాలు
- కాకినాడ జిల్లాలో 4,601
- కోనసీమ, తూర్పున 1,100

ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలు ఏయేశాఖలకు కేటాయించారో లోతుగా వివరాలు పంపాలని ఆదేశించింది. జిల్లాల వారీగా రెవెన్యూశాఖ ఈ వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేసింది.

5700 ఎకరాల మాటేమిటి..

కాకినాడ జిల్లాలో రెవెన్యూ శాఖకు చెందిన వేల కోట్ల విలువైన 4,601 ఎకరాల భూములను వివిధ శాఖల అవసరాలకు ఇప్పటి వరకు ఉచితంగా కేటాయించినట్టు నివేదికలో తేల్చారు. ఉమ్మడి జిల్లాలో ఇదే అత్యధికం. ఇందులో కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో 1,903 ఎకరాలు, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 2,697 ఎకరాలను ఉచితంగా కేటాయించారు. ఒక్క కాకినాడ రూరల్ మండలంలోనే వేల కోట్ల విలువైన 1,483 ఎకరాలు భూములను వివిధ ప్రభుత్వ శాఖల అవసరాల ముసుగులో ఉచితంగా కేటాయించేశారు. వీటిలో ఎక్కువగా గత వైసీపీ హయాంలో కేటాయించినవే ఉన్నాయి. ప్రభుత్వశాఖలకు కేటాయించిన ఈ భూములను కొందరు వైసీపీ నేతలు తమ పలుకుబడితో కబ్జా చేసేసి సొంతంగా వాడుకుంటున్నారు. కొందరైతే ఏకంగా ప్రైవేటుగా గోదాములు నిర్మించి అద్దెలకు ఇచ్చేసుకున్నారు. మరికొందరు లీజులకు ఇచ్చేశారు. కానీ భూమి పొందిన ప్రభుత్వ శాఖలు మాత్రం కిమ్మనడం లేదు. తొండంగి మండలంలో 2,405ఎకరాల్లో సగానికి పైగా కాకినాడ సెజ్‌కు కేటాయించారు. మరికొంత పోలవరం కాలువ, సబ్‌స్టేషన్లకు కేటాయించారు. వీటిలోను అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కోనసీమ జిల్లాలో గడచిన ఐదేళ్లలో 479 ఎకరాల వరకు కేటాయించారు. ఇందులో జల వనరులు, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, పంచాయతీశాఖలకే అధికంగా ఉన్నాయి. వీటిలోను అనేక చోట్ల ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. పలుచోట్ల చెరువులు, కోళ్లఫారాలు, షెడ్లు నిర్మించేసి వాడేసుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, అనపర్తి నియోజకవర్గాల్లో కేటాయింపులు జరగ్గా, వీటిలోను అనేకచోట్ల ఆయా శాఖలకు కేటాయించిన భూములపై నిఘాలేక ఇతరత్రా అవసరాలకు మళ్లిపోయినట్టు గుర్తించారు. తాజాగా ఉన్నతాధికారులు ఈ మేరకు భూకేటాయింపుల వివరాలతో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారు.

నెలంతా.. రేషన్!



- 15రోజుల కాలపరిమితి ఎత్తివేత
- 365 రోజులు రేషన్ దుకాణాలు
- 17 లక్షల కార్డుదారులు
- ఉమ్మడి జిల్లాలో అమలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు శుభవార్త. ఇక నుంచి ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు నెలంతా తెరిచే విధంగా పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేయనుంది. ఇప్పటికే దీనిపై ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ క్లారిటీ ఇచ్చేశారు. ఇకపై నెలంతా రేషన్ ఇచ్చే విధంగా ఆదేశాలు ఇస్తున్నామని మంత్రి ప్రకటించారు. దీంతో లబ్ధిదారుల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 17 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరూ ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ డిపోల నుంచి సరుకులు తీసుకుంటున్నారు. అయితే వివిధ పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన కూలీలు, సామాన్యులు ఒక్కొక్క పర్యాయం అనుకున్న సమయానికి రేషన్ తీసుకోలేకపోతున్నారు. అలా తీసుకోని నెలలో బియ్యం, పంచదార వంటి నిత్యావసర వస్తువులు వదిలుకోవాల్సి వస్తోంది. తాజాగా పౌరసరఫరాలశాఖ మంత్రి ఇచ్చిన ప్రకటన నేపథ్యంలో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వెల్లువిరిస్తోంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే రేషన్ ఇవ్వడం వల్ల కేవలం 90 శాతం కార్డుదారులకు మాత్రమే రేషన్ సరఫరా అవుతుంది. ప్రధానంగా నగరాల్లో, పట్టణాల్లో అయితే పోర్టబులిటీ విధానం వల్ల ప్రతి నెల పదో తేదీ వచ్చే సరికే పలు దుకాణాల్లో బియ్యం నిండు కుంటు న్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన కార్మికుల కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రధానంగా కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర పట్టణాల్లో ప్రతి నెల పదో తేదీకే 50 శాతం రేషన్ దుకాణాల్లో బియ్యం నిండుకుం టున్నాయి. దీనివల్ల బియ్యాన్ని పేదలు పొందలేకపోతున్నారు. ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కాలంటే నెలంతా రేషన్ పంపిణీ ద్వారా సాధ్యపడుతుంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు రేషన్ పంపిణీ చేయడం వల్ల ఏదైనా వీలున్న సమయంలో సరకులు తెచ్చుకునే సౌలభ్యం లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో ఉన్న రెండువేల రేషన్ దుకాణాలు ఇక నుంచి నెలంతా ఓపెన్ చేసే ఉంటాయి. పేదలకు సరుకులు పంపిణీ చేస్తూనే ఉంటాయి.

త్వరలో మరిన్ని సరుకులు

ఇక నుంచి రెగ్యులర్‌గా ప్రతినెల కందిపప్పు, నూనె, రాగులు, గోధుమపిండి రేషన్ కార్డుదారులకు ఇస్తామని మంత్రి ప్రకటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి వినియోగం ఎక్కువ. దీంతో కార్డుదారులు స్వాగతిస్తున్నారు.

ఉత్తర్వులకు ఎదురుచూపులు..

దీనిపై ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని కాకినాడ జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు తెలిపారు. ఉత్తర్వులు వచ్చిన తర్వాత దానిలో పేర్కొన్న విధంగా జిల్లాలో రేషన్ దుకాణాలు తెరిచి ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు రేషన్ దుకాణాల ద్వారా సమర్థంగా, నిత్యావసరాలు సకాలంలో అందజేస్తామన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా సౌభాగ్యలక్ష్మి బాధ్యతలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ (ఎఫ్ఏసీ)గా మంగళవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసి విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ డైరెక్టర్‌గా బదిలీ అయిన డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ మంగళవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో డాక్టర్ సౌభాగ్యలక్ష్మి సూపరింటెండెంట్‌గా ఛార్జి తీసుకున్నారు. బుధవారం ఉదయం పదిన్నర గంటలకు ఆసుపత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేయడం జరుగుతుందని కొత్త సూపరింటెండెంట్ అన్ని విభాగాధిపతులకు ఉత్తర్వులు జారీ చేశారు.

పొగాకు పంటపై జీఎస్టీ తగ్గింపునకు వినతి

దేవరపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పొగాకుపంటపై జీఎస్టీ తగ్గించాలని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరిని పొగాకు రైతు సంఘం నాయకులు మంగళవారం కోరారు. రాజమహేంద్రవరంలోని ఎంపీ కార్యాలయంలో దేవరపల్లి, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, పొగాకు రైతులు ఎంపీని కలిశారు. పొగాకు పంటకు ప్రస్తుతం 28 శాతం జీఎస్టీ ఉందని రాబోయే రెండు, మూడు రోజుల్లో కేంద్ర ప్రభుత్వం కొన్ని వస్తువులకు జీఎస్టీ తగ్గించే అవకాశం ఉందని దీనిలో భాగంగా పొగాకు పంటకు జీఎస్టీ తగ్గించాలని ఎంపీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై స్పందించిన ఆమె పొగాకు రైతు సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. కార్యక్రమంలో పొగాకు రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, కాట్రు సత్యనారాయణ, సింహాద్రి ధర్మావతారం, కాట్రగడ్డ అశోక్, ఇల్లూరి రాంబాబు, పిన్నమనేని మధుమోహన్, కాకర్ల నంది, కాకర్ల జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ చేరువగా ఐపీపీబీ

పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) సేవలు ప్రతి ఇంటికీ చేరువవుతున్నాయని రాజమండ్రి పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కోట శేషారావు అన్నారు. ఐపీపీబీ 8వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంకింగ్ సేవలు చివరి ఇంటి వరకూ వెళ్లాలనే ఉన్నత లక్ష్యంతో ప్రధాని మోదీ ఐపీపీబీని 650 శాఖలతో 2018 సెప్టెంబరు 1న ప్రారంభించారని గుర్తు చేశారు. తపాలా శాఖకు అనుబంధంగా ఈ సంస్థ పని చేస్తుందన్నారు. ఐపీపీబీ రాజమండ్రి తపాలా డివిజన్ 3.5 లక్షల ఖాతాదారుల మైలురాయిని దాటిందన్నారు. రాజమండ్రిలోనే 50 వేల మంది ఖాతాదారులు ఉన్నారన్నారు. 51 శాతం కంటే ఎక్కువ మంది మహిళా ఖాతాదారులు ఉండడం హర్షించ దగిన విషయమన్నారు. డివిజన్‌లో 375 పోస్టాఫీసుల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. జనరల్, లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థల భాగ స్వామ్యంతో గ్రూప్ యాక్సిడెంటల్ గార్డ్, టర్మ్ పాలసీల వంటి సేవలను అందిస్తోందన్నారు.పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలు, సుకన్య సమృద్ధి యోజన, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, రికరింగ్ డిపాజిట్, తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా వంటి వివిధ పథకాల ఖాతాదారులు ఐపీపీబీ మొబైల్ యాప్ ద్వారా సాంకేతిక సమస్యలు లేకుండా చెల్లింపులు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఎం.రాజేంద్ర నాయుడు, పోస్టల్ ఇన్‌స్పెక్టరు వంశీకృష్ణ, ఐపీపీబీ మేనేజర్ సాగర్ బాబు, అసిస్టెంట్ మేనేజర్ రేవంత్,భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఖైదీల ఆహారం ఓకేనా?



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలకు ఏ న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పూర్తిగా సహకరిస్తుందని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక కారాగారాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం నాణ్యతా ప్రమాణాలు, సదుపా యాలపై సమీక్షించారు. ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. ఖైదీల కుటుంబీకులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.



కేడర్ వెల్ఫేర్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల, తదితరులు

కార్యకర్తల ఆరోగ్యానికి ప్రత్యేక ప్రణాళిక

టీడీపీ కేడర్ వెల్ఫేర్ కార్యక్రమం ప్రారంభించిన గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నా 44 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్యకర్తలే తన బలమని.. కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు చేదోడువాదోడుగా ఉండడమే తన జీవిత లక్ష్యమని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. టీడీపీ రాష్ట్ర హెల్త్ విభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్ ఆధ్వర్యంలో కార్యకర్తల ఆరోగ్యానికి సంబంధించి ప్రత్యేక ప్రణాళి కతో రూపొందించిన తెలుగుదేశం పార్టీ కేడర్ వెల్ఫేర్ అనే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ సెల్ సహకారంతో నిర్దేశించిన కొన్ని ఆసుపత్రులకు కార్యకర్తలు వెళ్లినపుడు ఫీజులో 20 శాతం రాయితీ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించామన్నారు. సభ్యత్వ కార్డు కలిగిన వారు గోరంట్ల కార్యాలయానికి వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కేడర్ వెల్ఫేర్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో త్వరలో అమలు జేస్తారన్నారు. కేడర్ వెల్ఫేర్‌కు మొదటగా రూ.50 వేలు చెక్కును డాక్టర్ సెల్ టీమ్‌కు గోరంట్ల అందజేశారు.వివరాలకు 73860 50745 నెంబరులో సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్నివాసు దేవరావు, వెలుగుబంటి ప్రసాద్, పందూరి అప్పారావు పాల్గొన్నారు.

అవసరం మేరకు యూరియా : కలెక్టర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అవసరం మేరకు యూరియా సరఫరా చేస్తున్నామని, రైతులు అవగాహనతో శాస్త్రవేత్తల సూచనల మేరకే ఎరువులు వినియోగించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు సమయానికి సరఫరా అవుతున్న ఎరువులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ జిల్లాకు 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకూ 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చినట్టు చెప్పారు. గత ఖరీఫ్‌లో 13,300 మెట్రిక్ టన్నులు వినియోగించగా, ఈ సీజన్‌లో ఇప్పటికే 19 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని, ఇంకా 2,300 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. రాజమహేంద్రవరం, గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో గతేడాది కంటే 99 శాతం యూరియా వినియోగం జరిగిందన్నారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే యూరియా వినియోగించాలని సూచించారు. రైతులు సరైన మోతాదులో వాడితేనే ఉత్పాదక స్థాయి పెరిగి పంటలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పని సరిగా బిల్లు తీసుకోవాలని చెప్పారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మినా,ఇతర ప్రాంతాలకు తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ యూరియా అవసరానికి మించి వాడడం వల్ల సాగు చేసే భూమిలో పోషక సమతుల్యత దెబ్బతింటుందన్నారు.ఎరువులు ఎక్కువ కాలం నిల్వ ఉంచితే గడ్డకట్టే ప్రమాదం ఉం దన్నారు. యూరియా వినియోగం మించకూడదని తెలిపారు.

ఉపాధి హామీ కింద 900 కేటిల్ షెడ్స్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం కింద పశువుల షెడ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. జిల్లాలోని 18 మండలాల్లో మండలానికి 50 వంతున షెడ్లు నిర్మించుకోవడానికి అధికారులు ప్రతిపాదనలు కోరుతున్నారు. ఈ మేరకు మొత్తం జిల్లాలో 900 షెడ్లు నిర్మించుకోవచ్చు. ఈ పథకం కింద గేదెలు, ఆవులు మాత్రమే కాక గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్‌లు నిర్మించుకోవచ్చు. జిల్లా పశువైద్యాధికారుల ద్వారా ఈ ఎంపిక జరుగుతుంది. గ్రామాల్లో షెడ్లు నిర్మించుకునేవారు ఆయా ప్రాంతాల్లోని వెటర్నరీ డాక్టర్లను సంప్రదిస్తే వారు పరిశీలించి జిల్లా అధికారికి ప్రతిపాదన పంపుతారు. వాటిని డ్వామా పీడీ కార్యాలయ అధికారులు పరిశీలించి అనుమతులిస్తారు. గేదెలు, ఆవులు వంటి వాటిని మూడు విభాగాలుగా విభజించారు. రెండు పశువులకు సరిపడా షెడ్ నిర్మించుకోవడానికి యూనిట్ ఖర్చు రూ.1 లక్షా 15వేలు. అందులో ఉపాధి హామీ పథకం కింద లక్షా 3 వేల 500 అంటే 90 శాతం ఇస్తారు. మిగతా 10 శాతం అంటే 11,500 లబ్ధిదారుడు భరించాలి. నాలుగు పశువుల షెడ్ నిర్మాణానికి రూ.1,85,000 అంచనా వేశారు. అందులో ఉపాధి హామీ కింద 90 శాతం అంటే రూ.1.66, 500, లబ్ధిదారుడి వాటా కింద 10 శాతం అంటే 18,500 భరించాలి. ఆరు పశువుల షెడ్ నిర్మాణానికి రూ.2,30,000 అంచనా వేశారు. అందులో ఉపాధి హామీ కింద ప్రభుత్వం 90 శాతం అంటే రూ,2,07,000 ఇస్తుంది. లబ్ధిదారుడి వాటా 10 శాతం అంటే రూ.23 వేలు భరించాలి. ఇక గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు అంచనాలు సిద్ధం చేశారు. 20 గొర్రెలు లేదా 20 మేకల కోసం నిర్మించే షెడ్‌కు రూ. 1,30,000 అంచనా వేశారు.అందులో ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం 91 వేలు అంటే 70 శాతం ఇస్తుంది. లబ్ధిదారుడు 30 శాతం వాటా అంటే రూ.39 వేలు భరించాలి. 50 గొర్రెలు లేదా,50 మేకల షెడ్ నిర్మాణానికి రూ.2,30,000 అంచనా వేశారు.అందులో 70 శాతం అంటే రూ.1,61,000 ఉపాధి హామీ కింద ప్రభుత్వం ఇస్తుంది. మిగతా 30 శాతం రూ.69 వేలు లబ్ధిదారుడు భరించాలి. 100 కోళ్ల కోసం నిర్మించే షెడ్‌కు రూ.87 వేలు అంచనా వేశారు.అందులో 70 శాతం అంటే రూ.60, 900 ఉపాధి హామీ కింద ప్రభుత్వం భరిస్తుంది. మిగతా 30 శాతం అంటే 26,100 లబ్ధిదారుడు భరించాలి. 200 కోళ్లకు నిర్మించే షెడ్ వ్యయ అంచనా రూ.1,32,000 అందులో 70శాతం అంటే రూ.92,400 ప్రభుత్వం ఇస్తుంది. మిగతా 30 శాతం రూ.39,600 లబ్ధిదారుడు భరించాలి. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'


కార్యక్రమంలో పాల్గొన్న ఏపీజీఈఏ నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలపై కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఏపీజీఈఏ ఆధ్వర్యంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ రూపొందించిన వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. జిల్లా అధ్యక్షుడు పీ.గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలను తక్షణం చెల్లించాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, డీఏల చెల్లింపులపై సంఘం పోరాడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పే రివిజన్ కమిషన్‌ను తక్షణం నియమించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పీ.రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారానికి స్వయంగా చొరవ తీసుకోవాలన్నారు. భగవాన్‌దాస్ మాట్లాడుతూ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడుతూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని, తక్షణం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఆకాశరామన్న పిటిషన్లపై విచారణ జరిపే సంస్కృతి వైద్య ఆరోగ్యశాఖలో నెలకొనడం పట్ల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కొవ్వూరు తాలూకా ఉపాధ్యక్షురాలు జి.అనిత, మణి ప్రభావతి, నాగవాణి, తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు : చైర్‌పర్సన్


లైసెన్స్‌డ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్‌లలో ప్లాట్ల క్రమబద్ధీకరణలో దళారులను నమ్మి ప్రజలు మోసపోవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. మంగళశారం మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో ఎల్‌టీపీలు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విషయంలో అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, ఎల్‌టీపీలు నిర్వహించాలన్నారు. కొవ్వూరు మున్సిపాల్టీలో కొంతమంది ఉద్యోగులు నాన్ లేఅవుట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేసిన స్థలయజమానుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం నాన్ లేఅవుట్‌లలో అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందన్నారు. మీ ప్లాట్లను మా ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సచివాలయ కార్యదర్శులు ఒత్తి డి చేయడంతో పాటు అధికారులకు ఇవ్వాలని డబ్బు డిమాండ్ చేస్తున్నట్టు ఫిర్యాదులు అందినట్టు సమాచారం ఉందన్నారు. దీనిపై మంగళవారం చైర్‌పర్సన్ రత్నకుమారి, కమిషనర్ జీ.సందీప్, టౌన్ ప్లానింగ్ అధికారి టీ. మణిరామ్ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ అధి కారి మణిరామ్ మాట్లాడుతూ మున్సిపాల్టీ అధికారికంగా అనుమతించిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా మాత్రమే ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు.

తగ్గుముఖం పడుతున్న గోదావరి


గోష్పాదక్షేత్రం వద్ద తగ్గిన వరద ఉధృతి

కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా వరద పోటెత్తి ప్రవహిస్తున్న గోదావరి నది నెమ్మదిగా తగ్గుముఖం పడుతోంది. అయితే నదీ పరీవాహక ప్రాంతాలలో కాస్త వర్షాలు తగ్గడంతో ఉధృతి కాస్త నెమ్మదించింది.మంగళవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ప్రధాన స్నానఘట్టాలు ఇంకా వరద ముంపులోనే కనిపించినప్పటికీ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో నదిలో ఎవరూ దిగకుండా పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటుచేశారు. వరద ప్రవాహాన్ని చూడడానికి పట్టణ పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో జనాలు క్షేత్రానికి వస్తున్నారు.

105 టన్నుల యూరియా రాక

పెరవలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ సొసైటీలకు 105 టన్నుల యూరియా వచ్చినట్టు ఏవో మేరీకిరణ్ తెలిపారు. ఇందులో పెరవలి డీసీఎంఎస్‌కు 30.6 టన్నులు, ఖండవల్లి డీసీఎంఎస్‌కు 30.6 టన్నులు, అజ్జరం సొసైటీకి 10 టన్నులు, కాపవరం సొసైటీకి 10 టన్నులు, తీపర్రు సొసైటీకి ఏడుటన్నులు, కానూరు సొసైటీకి 17 టన్నులు కేటాయించామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా అందించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వేల పేరుతో మండల సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో గ్రామాలలోని సమస్యలపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేయాలని ఎంపీడీవో రమణను ఆదేశించారు. గ్రామాలలో పారిశుధ్యం, చెత్తసేకరణ, వీధిదీపాల నిర్వహణ, డ్రైనేజీలలో సిల్టు తొలగింపు, మంచినీటి పైపులైను లీకేజీలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గతంలో పంచాయతీ నిధులను జగన్మోహనరెడ్డి దారి మళ్లించారని, కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండల, పంచాయతీల నిధులను మీరే ఖర్చు చేసుకుంటున్నారన్నారు. త్వరలోనే 15వ ఆర్థిక సంఘం నిదులు జమకానున్నాయన్నారు. గ్రామాలలో పర్యటనుకు వచ్చినప్పుడు పారిశుధ్యం బాగాలేకపోయిన, సిబ్బంది అలసత్వాన్ని గుర్తించిన చర్యలు తప్పవన్నారు. జగనన్న కాలనీలలో పిచ్చిమొక్కలను తొలగించి, డబ్ల్యూబీఎం రోడ్లు వేయాలన్నారు. లేనిచో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. మండల సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ గ్రామ సమస్యలపై చర్చించకపోవడం శోచనీయమన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా ప్రదాన సమస్యల పరిష్కారానికి నిదులు మంజూరు చేశారన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిని 50 నుంచి 150 పడకలు చేయాలని ప్రతిపాదించగా స్థలాభావాన్ని దృష్టిలో పెట్టుకుని రూ. 25 కోట్లతో 100 పడకల ఆసుపత్రికి ప్రతిపాదనలు తయారుచేయడం జరిగిందన్నారు. జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీడీవో టీబీవీ రమణ, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు


9వ వార్డులో పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి, తదితరులు

కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణాన్ని పారిశుధ్య రహితంగా తీర్చిదిద్దడానికి ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. మంగళవారం మున్సిపాల్టీలోని 8,9,10 వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. వాటిని చైర్‌పర్సన్ పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణంలోని 23 వార్డులలో గ్యాంగ్‌వర్కు చేపట్టి పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌చార్జి రవి, మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

ఈ పంటను త్వరగా నమోదు చేసుకోవాలి


రైతులకు సూచనలు చేస్తున్న ఏవో

ఉండ్రాజవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈపంట నమోదు త్వరగా పూర్తిచేయాలని ఏవో బీ. రాజారావు పేర్కొన్నారు. మంగళవారం తాడిపర్రులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో 16 వేల ఎకరాల్లో వరి, ఇతరపంటలు సాగుచేస్తున్నట్లు చెప్పారు. వీటిలో ఇంత వరకు 8,500 ఎకరాల్లో పంట నమోదు జరిగినట్టు చెప్పారు. ఇంకా మిగిలిన రైతులు నమోదు చేయించుకోవాల్సి ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతుల వద్ద ఉన్నటు వంటి పనిముట్లు, వారికి కావాల్సిన వ్యవసాయ పనిముట్లు, యంత్రపరికరాలపై సర్వే జరుగుతుందని, రైతులు ఈ సర్వేకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. గ్రామసర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు,నాయకులు అక్కిన గోపాలకృష్ణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

● సినీ నటుడు పృథ్వీరాజ్


చాగల్లులో పృథ్వీరాజ్‌ను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చాగల్లు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చాగల్లులో తెలగ సంఘం ఆధ్వర్యంలో శ్రీగణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తూ కళలు, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని సినీ నటుడు పృథ్వీ రాజ్ అన్నారు. సోమవారం రాత్రి గండ్రోతు కృష్ణారావు ఆడిటోరియంలో పృథ్వీరాజ్ దంపతులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ఒక్కటీ అడక్కు సినిమాతో నటుడిగా జీవితం ప్రారంభించానని, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ ఇక్కడ అనే డైలాగ్ చాలా పాపులర్ అయ్యిందన్నారు. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఏపీ నాటక పరిషత్ చైర్మన్ బుద్ధాల వెంకట రామారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గండ్రోతు సురేంద్ర కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు ఇంటి కృష్ణవేణి, కమిటీ సభ్యుడు జుట్టా ఏడుకొండలు, ఇంటి వీర్రాజు, టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, కోడూరి ప్రసాద్, కోడి చంటియ్య, తాళ్లూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'గణపతిని మొక్కుకుంటే అన్నీ శుభాలే'

చాగల్లు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈశ్వరుడు ఆత్మ ఒక్కటేనని, మనలోని ఆత్మ రూపమే ఈశ్వరుడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకారుడు, రుషీ పీఠం వ్యవస్థాకుడు సామవేదల షణ్ముఖ శర్మ అన్నారు. మంగళవారం చాగల్లు నెలటూరు వర్తక సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయన పాల్గొని గణపతితత్వం గురించి విశ్లేషణతో కూడిన ప్రవచనం చెప్పారు. వినాయకుడ్ని మొక్కుకుంటే అన్నీ శుభాలే జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వేదపండితులు లింగాల శ్రీనివాసశర్మ, వర్తక సంఘం సభ్యులు గ్రంధి రాంబాబు, జాను గంగారావు, అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఆశా డే కార్యక్రమాలు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ఇంటింటా ఆరోగ్య కార్యక్రమాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ ఆర్. ఉషాదేవి పేర్కొన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో ఉన్నవారి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. క్షయరహిత గ్రామాలుగా ఉండేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. అనంతరం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఫ్లెక్సీని ప్రదర్శించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ వీ. ఆశాజ్యోతి, ఆశ నోడల్ ఆఫీసర్ కేడీవీ కుమారి, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: పెరవలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలను క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. టీబీ ముక్తిభారత్ అభియాన్‌లో భాగంగా ఆరోగ్య కేంద్రం పరిధిలో క్షయవ్యాధి చికిత్స పొందుతున్నవారికి పూర్తిగా మందులు, పోషకాహారం అందేలా చూడాలని ఆశాకార్యకర్తలకు సూచించారు. ఆశాజ్యోతి, మార్తమ్మ, రాజేష్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, పశివేదల రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఉదయం గుర్తుతెలియని దాదాపు 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్ఐ పీ.అప్పారావు తెలిపారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతడి ఒంటిపై తెలుపురంగు చిన్నచారలు కలిగిన పొడవు చేతుల షర్ట్, ఆకుపచ్చ రంగుపై ఎరుపురంగు పువ్వుల డిజైన్ లుంగీ, రంగుల టర్కీ టవల్ ఉన్నాయన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 9490617090, 99480 10061 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ఎన్నికల హామీలను నిలబెట్టుకుంటాం

గోపాలపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సహాయ సహకారాలతో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేసి ఇచ్చినమాట నిలబెట్టుకుంటామని టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రరావు (రాము) అన్నారు. గోపాలపురంలోని 16వ వార్డు బెస్తపేటలో మండల పరిషత్ నిధులు రూ.లక్షతో నిర్మించిన చేతిపంపును మంగళవారం ప్రారంభించారు. అనంతరం గోపాలపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు భూరెడ్డి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా కేకును కోసి బెస్తాపేట వాసులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వడ్లమూడి రమేశ్, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్‌బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీనివాస్, బాలాజీ, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జ్యేష్ట శ్రీధర్, మద్దిపాటి రమేశ్, రేగులయ్య, కొడవటి చినవెంకటేశ్వరరావు, గూడా హుస్సేన్, చోళ్ల నాని, దాసరి రత్నబాబు, బంటుమిల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపూడి రేణుకకు అభినందనలు


రేణుకను అభినందిస్తున్న బీజేపీ నేతలు

పెరవలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి బీజేపీని పటిష్టపరచాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక తెలిపారు. ఇటీవల రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన బీజేపీ నాయకులు మంగళవారం తణుకులో కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సింహాద్రి సత్యనారాయణ, పీ. లీలాకృష్ణ, కే. శివప్రసాద్, తీపర్రు సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ, అక్కిన గోపాలకృష్ణ, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్ర, రంగినీడి గంగాధర్, బూరుగుపల్లి వెంకటేశ్వర్లు, కరుటూరి సుబ్బారావు, బోళ్ల సత్యనారాయణ, అంజనేయరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పతకాలు అందజేత

చాగల్లు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో చాగల్లు హైస్కూల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన టీ. సాయి సతీష్ వర్మకు దాత జుట్టా సీతారామయ్య జ్ఞాపకార్థం వారి అల్లుడు వర్ధినీడి భీమేశ్వరరావు వారి కుమారులు (పూళ్ల) బంగారు పతకాన్ని ముఖ్యఅతిథుల చేతులమీదుగా అందజేశారు. అలాగే ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన వీ. పుష్పలక్ష్మి కుమారికి జగతా వీరభద్రరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాసరావు బంగారు పతకాన్ని అందజేశారు.

హత్యా నేరం కేసులో ఏడేళ్ల జైలు, జరిమానా

నల్లజర్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంకి చెందిన చల్లారి వెంకట్రావును అదే గ్రామానికి చెందిన కూసపం బాబూరావు 2021లో ఇనుప రాడ్డుతో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కోర్టు విచారణ అనంతరం నేరు రుజువు కావడంతో మంగళవారం తాడేపల్లి గూడెం కోర్టు బాబూరావుకు ఏడేళ్ల జైలు, రూ. 20వేల జరిమానా విధించినట్టు నల్లజర్ల పోలీసులు తెలిపారు. అప్పట్లో వెంకట్రావు ఇంటి వద్ద కల్లు దుకాణం ఉండేది... అక్కడకి కల్లు తాగడానికి వచ్చిన బాబూరావును డబ్బులు అడగ్గా... ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువురూ కొట్టుకున్న సమయంలో బాబూరావుకు పక్కనే ఉన్న ఇనుప రాడ్డు చేతికి అందడంతో వెంకట్రావు తలపై కొట్టడంతో మృతిచెందాడు.

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు


కొవ్వూరులో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి , తదితరులు

కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం కొవ్వూరు పట్టణం, మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మెరకవీధి వినాయకుని గుడి సమీపంలో పట్టణ అధ్యక్షుడు డేగల రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, ఎరుబండి సురేష్, కె. నవ్య టీడీపీ,జనసేన నేతలు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చరిష్మా గల నాయకుడని మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు అన్నారు. అన్నదేవరపేటలో జనసేన నాయకుడు చెవ్వూరి బంగార్రాజు, రాము ఆధ్వర్యంలో పవన్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వంచారు. దీనికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, టీడీపీ యువ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య విచ్చేసి కేకును కట్ చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ముళ్లపూడి శ్రీరామచంద్ర మూర్తి, గన్నిన సత్తిబాబు, బీజేపీ నాయకులు బాలకృష్ణ, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. గజ్జరంలో జనసేన నేత పూలపల్లి బాలకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జనసేన గ్రామాధ్యక్షుడు అవుడు కృష్ణ పంచాయతీ వర్కర్లకు నూతనవస్త్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దండమూడి శేషగిరి (శేషు), మార్లపూడి కృష్ణబాబు, పోలపల్లి చిరంజీవి, పాశం నాని, మరిచర్ల శ్రీనివాస్, పూలపల్లి నాగబాబు, పెనుగొండ సతీష్, తదితరులు పాల్గొన్నారు. బల్లిపాడులో జనసేన నేత పెండ్యాల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమానికి జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో గనిశెట్టి గంగార్ నాయుడు, నరాలశెట్టి విజయ్, నవీన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెరవలి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. పెరవలి శివాలయంలో అభయాంజనేయస్వామి వారి ఆలయంలో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకులోని వృద్ధాశ్రమం, పాలంగిలోని మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో జనసేన నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు పిప్పర రవి, సంగీత నాగు, పొప్పుప్పు సూర్యనాగేశ్వరరావు, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, కోటిపల్లి మురళీ కృష్ణ, వీరవల్లి శ్రీను, నాగిరెడ్డి నాగేశ్వరరావు, శ్రీహరి, రంకిరెడ్డి ప్రసాద్, నందిప చక్రవర్తి, పొప్పున నాగేశ్వరరావు, కోలా సీతయ్య, గుడాల రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణం, మండలంలో మంగళవారం జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైయస్సార్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటరులో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే రంగా సుబ్బారావు, సత్యవతి కాపు కల్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తాడిమళ్ల లోని చోళమ్మ, మల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిడదవోలు పట్టణ, మండల అధ్యక్షుడు రంగా రమేష్, పోలిరెడ్డి వెంకట రత్నం, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, బచ్చునాని, చెన్నా పురపు రాజా, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: నీతి నిజాయితీ కలిగిన మహోన్నత వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. పవన్ జన్మదినోత్సవం సందర్భంగా దేవరపల్లి బస్టాండ్ వద్ద మంగళవారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పసుపులేటి శివనాగప్రసాద్, చవల సీతా రత్నసూర్యకుమారి, అనిశెట్టి గంగరాజు, సూరిశెట్టి బాలు, మాధవరపు వెంకటేశ్వరరావు, సిద్దా తాతబ్బాయి, దాసరి శేషరావు, అడబాల మణికంఠ, కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఉండ్రాజవరం, తాడిపర్రు, పాలంగి, కె. సావరం, చివటం, తదితర గ్రామాల్లో వేడుకలు జరిగాయి. తాడిపర్రులో జనసేన నాయకుల ఆధ్వర్యంలో యువకులు, విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల : మండలంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చీపురుగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గుండా బత్తుల వరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జనసేన నేతలు కవులూరు సత్తిబాబు, కొత్తపల్లి హరిబాబు, తలంశెట్టి శివప్రసాద్, చెల్లు నాయుడు, పల్లప రాజు, ఐటీ వింగ్ ఉన్నమట్ల సత్యకిరణ్, ఉన్నమట్ల రమేష్, తలంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలికిచర్లలో ...

తెలికిచర్లలో పవన్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఏలూరు ఆశ్రమ వైద్యబృందం వచ్చి 60 మంది జనసైనికుల నుంచి రక్తసేకరణ చేపట్టింది. అలాగే ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి 200 మందికి వైద్యపరీక్షలు చేసిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జిల్లా కార్యదర్శి అచ్యుత సత్య నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు చోడసాని బాపిరాజు, సర్పంచ్ బండి చిట్టి, రుద్ర శ్రీను,గుడిశెట్టి శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: రాష్ట్ర అభివృద్ధి సంకల్పంతో ప్రజల సంక్షేమం కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన పుట్టిన రోజు వేడుకలను చాగల్లు తెలగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా భారీ కేక్‌ను కమిటీ కుర్రాళ్ల ఫేమ్ యశ్వంత్ పెండ్యాల, ఎమ్మెల్యేతో కటింగ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే, హీరో, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబును సన్మానించారు.

సుప్రీం సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలి


నిరసన తెలియజేస్తున్న మహిళలు

కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థల సంఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక డిమాండ్ చేశారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలో మహిళలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లిక మాట్లాడుతూ ధర్మస్థల మాజీ పారిశుధ్య కార్మికుడు భీమ, భట్ మొదటి స్టేట్‌మెంటు ఆరోపణపైన, సిట్ కస్టడీ దర్యాప్తులో మాట మార్చినట్టు వస్తున్న విషయాలపై న్యాయవిచారణ జరిపించాలన్నారు. భీమా చేస్తున్న రకరకాల ఆరోపణలపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టాలన్నారు. దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్నటువంటి హింసను నిరోధించడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలన్నారు. పీవోడబ్ల్యు, జమాతే ఇస్లామి హింద్ ఉమెన్స్ వింగ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

కొవ్వూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం కొవ్వూరు పట్టణం, మండలంలో ఘ నంగా నిర్వహించారు. మెరకవీధి వాటర్‌ట్యాంకు, పుంతలో ముసలమ్మ ఆలయాల వద్ద ఉన్న ఆయన విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పేద ప్రజల కు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బండి అబ్బులు, కోడూరి శివరామకృష్ణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కంటమణి రమేష్‌బాబు, కవల నాగేశ్వరరావు, మాసా ఆనంద్, పిక్కి శ్రీను, ఏలూరి విజయలక్ష్మి కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఉండ్రాజవరం, మోర్త, కాల్ధరి గ్రామాల్లో వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలంగిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, వైసీపీ నాయకులు వెలిచేటి జానకిరామయ్య, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, పాలాటి శరత్‌బాబు, బొక్కా శివకుమార్, కేతా సత్యనారాయణ, టేకి నాగేంద్ర, కడలి రవి, కాటూరి కుమారస్వామి, యార్లగడ్డ అశోక్, కొల్లి రాంబాబు, మేళం రవి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని పెద్దేవంలో వైసీపీ గ్రామాధ్యక్షుడు బట్టు సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి గ్రామసర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉపసర్పంచ్ తోట రామకృష్ణ, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో వైలవరపు రాధాకృష్ణ, తిగిరిపల్లి రమేష్, పలసపూడి రాజశేఖర్, గెడ్డం వెంకటేష్, చముకూరి సత్యన్నారాయణ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడదవోలు: స్వర్గీయ మాజీ సీఎం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ అందరి హృదయాల్లో చిరస్థాయిగా ఉన్నాయని నిడదవోలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ మేడవరపు భద్రందొర అన్నారు. మంగళవారం పట్టణంలో వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దారపరెడ్డి సుజాత, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, అగర్వాల హీరాలాల్, మహ్మద్ అన్వర్‌ఖాన్, కాకి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్వర్గీయ మాజీ సీఎం వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైసీపీ నేతలు దుగ్గిన గంగాధరరావు, పచ్చా రామ్‌గోపాల్, కామిశెట్టి దుర్గారావు, దుగ్గిన ప్రసాద్, కవల శ్రీనివాస్, ఎంపీటీసీ పల్లికొండ రామలక్ష్మి పాల్గొన్నారు.